ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 17 ఫిబ్రవరి 2025 | 5





10 రోజుల్లోనే.. ఎమ్మెల్సీ ఎన్నిక

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక దగ్గరపడుతోంది.. ఈ నెల 27వ తేదీన ఎన్నిక జరగనుంది. ఇక మిగిలింది 10 రోజులే.. ఈ నేపథ్యంలో అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు.. పట్టభద్రులను కలిసి తమకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు.. మరో వైపు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాజమహేంద్రవరం చెరుకూరి కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జనసేన గోదావరి జిల్లాల ప్రతినిధుల ఆత్మీయ సమావేశానికి మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరై కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు గెలిపించాలని పిలుపునిచ్చారు..

7,8 పేజీల్లో


కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు సన్మానం చేస్తున్న మంత్రులు నాదెండ్ల, దుర్గేష్

హాకీ..ఆడేశారు!

హాకీలో తలపడ్డారు.. నువ్వా నేనా అంటూ పోటీపడ్డారు.. గోల్స్ కొట్టేందుకు ఎగబడ్డారు.. ఎవరో కాదండోయ్.. కలెక్టర్లు.. ఎస్పీలు.. ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడలో రెండో రోజు ఆదివారం ఉదయం నుంచి హోరాహోరీగా సాగింది..ఎండను సైతం లెక్కచేయకుండా సివిల్ సర్వీసెస్ క్రీడాకారులు గెలుపుకోసం పట్టుదలగా ఆడారు. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు హాజరై క్రీడాకారులకు మద్దతుగా నిలిచారు.. - వివరాలు 7లో


రెండో రోజు ఆదివారం హాకీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ప్రమాదంలో.. అడవి!


ఎలా జరిగింది : ఇటీవల దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో దగ్ధమవుతున్న అటవీ ప్రాంతం(ఫైల్)

తూర్పునకు 4 దిక్కులా రిజర్వు ఫారెస్టు ఇలా..

దివాన్‌చెరువు	- 2 వేల ఎకరాలు
నల్లజర్ల - ద్వారకాతిరుమల	- 3 వేల ఎకరాలు
గోపాలపురం మండలం	- 2 వేల ఎకరాలు
గోకవరం మండలం	- 18 వేల ఎకరాలు

అడవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా కనీసం కన్నెత్తి చూసేవారే లేరు. ఒక పక్కన అడవి ఆక్రమణలు.. మరో పక్కన సారాబట్టీలు.. ఇంకో పక్కన వ్యభిచార కార్యకలాపాలు సాగుతున్నా కనీసం కట్టడి చేసే వారే కరువయ్యారు..జిల్లా కేంద్రం కావడంతో అటవీ శాఖలు చుట్టూ ఉన్నా.. పక్క జిల్లా కాకినాడలో అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నా అడవిని రక్షించేవారే కానరావడంలేదు. ఇటీవల అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఈ సీజన్‌లో ఇటువంటి ప్రమాదాలు సాధారణమేనని సాక్షాత్తూ అటవీ అధికారి కొట్టిపారేయడం తప్పనే వాదన వినిపిస్తోంది. ఈ అగ్ని ప్రమాదంపై స్థానికుల నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కావాలనే నిప్పుపెట్టారా లేక అనుకోకుండా జరిగిన తప్పిదమా అనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి.ప్రమాదంపై విచారణ జరిపించి.. అటవీ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

రాజానగరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా ప్రత్యేకత ఏంటంటే జిల్లా కేంద్రాన్ని ఆనుకుని అటవీ ప్రాంతం ఉండడం.. ఈ అటవీ ప్రాంతం చుట్టూనే ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. అటవీ శాఖ అధికారులకు కూతవేటు దూరంలోనే ఆ రిజర్వు ఫారెస్టు ఉంది. అధికార యంత్రాంగం చుట్టూ ఉన్నందుకు ఫారెస్టు పచ్చదనంతో కళకళలాడుతూ ఉండాలి.పర్యవేక్షణ లేకపోవడంతో రిజర్వు ఫారెస్టు కాస్తా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది..ఇటీవల అటవీ ప్రాంతం దగ్ధం కావడంతో అందరి చూపు అడవిలో జరిగే కార్యకలాపాలపై పడింది. అటవీ అధికారులు ఈ సంఘటన సాధారణమేనని కొట్టిపారేసినా..నిప్పులేనిదే పొగ ఎక్కడ నుంచి వస్తుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు..ఆక్రమణలు

- జిల్లా కేంద్రంలోనే రిజర్వు ఫారెస్టు
- చుట్టూ అధికార యంత్రాంగం
- అయినా కన్నెత్తి చూసేవారే లేరు
- నిత్యం వ్యభిచార కార్యకలాపాలు
- సారా బట్టీలకు అడ్డా
- ఇటీవలే అగ్ని ప్రమాదం
- జిల్లా చుట్టూ వేలాది ఎకరాలు
- అయినా రక్షణ చర్యలు నిల్



జోరుగా సారా బట్టీలు..

తూర్పుగోదావరి జిల్లా కేంద్రం దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు సారా బట్టీల నిర్వహణకు అడ్డాగా మారింది. ఫారెస్టును ఆనుకుని దివాన్ చెరువు,హౌసింగ్ బోర్డు కాలనీ, లాలాచెరువు, శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, రఘునాథపురం, పిడింగొయ్యి, వెలుగుబంద, చక్రద్వారబంధం పరిసర గ్రామాలు, మామిడి, జీడిమామిడి పండ్ల తోటలతో పాటు రియల్ ఎస్టేట్ ప్లాట్లు ఉన్నాయి.దీంతో జనసంచారం అంతగా లేకపోవడంతో కొంతమంది సారా బట్టీల నిర్వహణకు అనువుగా మలచుకున్నారు.రాత్రి పగలు తేడా లేకుండా సారా తయారు చేస్తున్నారు. సారాను ఇక్కడ నుంచి సుదూర ప్రాంతాలకు బాటిళ్లు, టిన్నులు, కవర్లలో నింపి గుట్టు చప్పుడు కాకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరం.. జాతీయ రహదారి పక్కనే ఉన్న అడవిని అడ్డాగా చేసుకుని భారీ స్థాయిలో సారా తయారీ సాగుతున్నా పోలీసులు ఫారెస్టు వైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏళ్ల తరబడి గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ వ్యవహారమంతా పోలీసుల కనుసన్నల్లో జరుగుతుందని, మామూళ్లకు అలవాటుపడిన సారా బట్టీల నిర్వాహకులను ప్రోత్సహిస్తూ మత్తులో జోగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



హైవేను ఆనుకుని 2 వేల ఎకరాలు

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టు ఆహ్లాదకర వాతావరణం,పచ్చని ప్రకృతి సోయగాలతో వీక్షకులను మైమరపించేలా ఉంటుంది. దాదాపు 845 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన రిజర్వు ఫారెస్టును 16వ నెంబరు జాతీయ రహదారి రెండు భాగాలు విభజించింది. దీనిలో ఈస్ట్ ఫారెస్టు 311 హెక్టార్ల విస్తీర్ణం, వెస్ట్ ఫారెస్టు మరో 534 హెక్టార్లు విస్తీర్ణంలో విస్తరించి ఉన్నది. సుమారు 2112.5 ఎకరాలు ఉంటుంది. ఈ ఫారెస్టులో జంతువులు అరుదు.దీంతో కొంతమంది అక్రమార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మలుచుకుంటున్నారు.రాజమహేంద్రవరానికి చేరువలో హైవేను ఆనుకుని ఇరువైపులా రిజర్వు ఫారెస్టు విస్తరించి ఉండడంతో రిసార్టులు ఏర్పాటు చేస్తే టూరిస్టుల రాకతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని..పుష్కరాల నేపథ్యంలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ దృష్టి సారించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


ప్రమాదం జరిగిన రోజు అటవీ ప్రాంతం పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్ ఇతర అధికారులు (ఫైల్)

వ్యభిచార స్థావరాలు..

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో వ్యభిచార స్థావరాలు ఎక్కువగానే దర్శనమిస్తాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఇరువైపులా ఫారెస్టు, పండ్ల తోటల్లో ఇతర ప్రాంతాలకు చెందిన కొంత మంది వ్యభిచారాలు సాగిస్తున్నారు. జాతీయ రహదారిపై వెళుతుంటే నిత్యం పదుల సంఖ్యలో తారసపడతారు. రాజానగరం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్నా దీనికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.వ్యభిచారుల వద్దకు వస్తున్న విటులను కొంతమంది అప్పుడప్పుడు పోలీసులకు పట్టిస్తుంటారు. వీరిని పోలీసులు భయభ్రాంతులకు గురిచేసి వీరి వద్ద ఉన్న నగదు,బంగారం దోచుకున్న సంఘటనలూ ఉన్నాయి.వ్యభిచార స్థావరాలు కొంత మంది పోలీసులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. అందుకే ఈ స్థావరాలపై పోలీసులు దాడి చేసిన సందర్భాల్లేవు. వ్యభిచారం కోసం వెళ్లిన వారు స్మోకింగ్ చేసి పారేసిన సిగరెట్ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

ఆక్రమణల్లో రిజర్వు ఫారెస్టు..

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు చుట్టూ ఆక్రమణలే దర్శనమిస్తాయి. ఫారెస్టును ఆనుకుని పక్కా భవన నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. ఇటీవల ఆటోనగర్ సమీప ప్రాంతంలో అడవి లో చెట్లను నరికేస్తున్నా అడిగేవారే లేరు. నగరానికి సమీపాన ఉండడంతో చుట్టూ పండ్ల తోటలతో పాటుగా మరికొన్ని చోట్ల పక్కా భవనాలు, జోరుగా సారా బట్టీలు పుట్టుకొస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూడడంలేదు. దీంతో అడవి ఆక్రమణలకు గురవుతోంది.

అమ్మకాలు.. చికెన్!



వెలవెలబోయిన చికెన్ దుకాణాలు

- కనిపించిన బర్డ్‌ఫ్లూ ప్రభావం
- భారీగా పడిపోయిన అమ్మకాలు
- చికెన్ కొనుగోళ్లు లేక నిరాశ
- మటన్, ఫిష్ వైపు చూపు
- ధరలు పెంచేసిన వ్యాపారులు

అనపర్తి/కొవ్వూరు/నల్లజర్ల,ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బర్డ్‌ఫ్లూ భయపెడుతోంది.. ఎంతలా అంటే.. నిన్నటి వరకూ ఆదివారం వచ్చిందంటే చికెన్ ముక్కలేనిదే ముద్ద దిగని పరిస్థితి.. అయితే బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ఆదివారం చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి. ధరలు కాస్త తగ్గినప్పటికీ వినియోగదారులు లేకపోవడంతో దుకాణాలు ఖాళీగా దర్శనమిచ్చాయి.అనపర్తిలోని మార్కెట్లో మాత్రమే దుకాణాలు తెరుచుకున్నాయి.అయినప్పటికీ వినియోగదారులు అటువైపు చూడకపోవడంతో చికెన్ షాపుల యజమానులు వినియోగదారుల కోసం పడిగాపులు కాశారు. మరో వైపు ఫిష్, మటన్ అమ్మకాలు పెరగడంతో ఆయా దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. మటన్ వినియోగదారులకు మాత్రం ధరల విషయంలో జేబులకు చిల్లులు పడ్డాయి. అనపర్తిలో ఆదివారం ఒక్క రోజునే సుమారు 1000 కోళ్ల అమ్మకాలు జరగాల్సి ఉండగా కనీసం 50 కోళ్లు కూడా విక్రయించలేదని చికెన్ వ్యాపారులు వాపోతున్నారు. అమ్మకాలు నిలిచిపోవడంతో చికెన్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. అనపర్తి పరిసరాల్లో బర్డ్ ఫ్లూ లేకపోయినా వినియోగదారులు మాత్రం చికెన్ తినేందుకు భయపడుతున్నారు. కొవ్వూరు పట్టణ, మండలంలోనూ చికెన్ షాపులు వెలవెలబోయాయి. కొవ్వూరు పట్టణంలో ఆదివారం ఒక్కరోజే 3 వేలకు పైగా కోళ్ల అమ్మకాలు సాగేవి.. ఆదివారం వ్యాపారం ఉంటుందని ఆశతో దుకాణాలు తెరచినప్పటికీ చికెన్ కొనుగోలుకు ప్రజలు ముందుకు రాకపోవడంతో వ్యాపారులు నిరాశ చెందారు.గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల వ్యాపారం నష్టపోయామని వ్యాపారులు వాపోతున్నారు.


కొవ్వూరులో ఖాళీగా ఉన్న చికెన్ షాపు

మటన్‌పైనే మక్కువ..

చికెన్ షాపులు వెలవెలబోయాయి.ఇదిలా ఉండగా మాంసాహార ప్రియులు మటన్‌పై మక్కువ చూపిస్తున్నారు.ఇదే అదనుగా మటన్, చేపల వ్యాపారులు ఇష్టానుసారం ధరలు పెంచేశారు. ఆదివారం మార్కెట్‌లో ఎక్కువగా మటన్ అమ్ముడుపోయింది.దీంతో నిన్నటి వరకురూ.800 పలికిన మటన్ ధర రూ.1000కి చేరుకోగా రూ.1000లు ఉన్న బోన్‌లెస్ మటన్ ధర రూ.1200కు చేరుకుంది.మరో వైపు చేపల వ్యాపారులు ధరలు పెంచేశారు.కిలో రూ.170 లకు లభించాల్సిన చేప నేడు రూ.200కు చేరింది.అమాంతం ధరలు పెంచేసినా ధరల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవడంలేదని వినియోగదారులు వాపోతున్నారు.


అనపర్తిలో చేపల దుకాణం వద్ద అమ్మకాలు

దగ్గరుండి భూసర్వే చేయించుకోండి

రీసర్వేపై అవగాహన ర్యాలీలో జేసీ చిన్నరాముడు

రాజానగరం/రంగంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వే చేసే సమయంలో సంబంధిత భూయజమానులు అందుబాటులో ఉండాలని జేసీ చిన్నరాముడు పిలుపునిచ్చారు.రాజానగరం మండలం తోకాడ, రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామంలో ఆదివారం భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మన భూమి.. మన భవిష్యత్ అన్నారు. దీనిలో భాగంగా క్షేత్ర స్థాయిలో భూములు రీసర్వే చేపట్టడం జరుగుతుందన్నారు.రెవెన్యూ సిబ్బంది రీసర్వే చేసే సమయంలో భూ యజమానులు అందుబాటులో ఉంటూ సరిహద్దుల నిర్ణయించే ప్రక్రియలో సర్వే సిబ్బందికి సహకరిస్తే వివాదాలకు ఆస్కారం లేకుండా పరిష్కారం లభిస్తుందన్నారు. రీ సర్వే అనేది మన భూహక్కు పత్రాలకు బలమైన పునాది అనే విషయాన్ని మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవో ఆర్.కృష్ణనాయక్, తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి,ఎంపీడీవో జేఏ ఝాన్సీ, కూటమి నాయకులు ఎలుగుబంటి సత్తిబాబు, జటప్రోలు వెంకటేశ్వరరావు, తహశీల్దార్ కోసు అనసూయ, ఎంపీడీవో సాయిబాబు, డీటీ ఉండవిల్లి రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



దొంతమూరు అవగాహన ర్యాలీలో జేసీ చిన్నరాముడు తదితరులు

28 రోజుల్లో పది పరీక్షలు : డీఈవో

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):పదో తరగతి పరీక్షలు 28 రోజుల్లో మాత్రమే ఉన్నాయని..సమయాన్ని సద్వినియోగం చేసుకుంటేనే విజేత అవుతారని డీఈవో వాసుదేవరావు అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పది విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ 28రోజులు చదివేది అత్యంత కీలకమన్నారు. ఇప్పటి వరకూ జరిగిన అన్ని పోటీ పరీక్షల్లో ఏయే అంశాల్లో మార్కులు తగ్గుతున్నాయో చూసుకుని ఉపాధ్యాయులతో సందేహాలను నివృత్తి చేసుకుని నూరుశాతం మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు.ఆరోగ్యం పట్ల కూడా అత్యంత శ్రద్ధ వహించాలన్నారు. త్వరగా నిద్రపోవడం, తెల్లవారుజామున లేచి సాధన చేయాలన్నారు.కార్యక్రమంలో హెచ్ఎం ఎంవీఎం. సుబ్రహ్మణ్యం,ఉపాధ్యాయులు జి.అప్పారావు, కన్నమదొర, విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టాలు.. ఫుల్!



మద్యం ఫుల్.. అమ్మకాలు డీలా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మద్యం అమ్మకాలు మగతగా సాగుతున్నాయి. అటు మద్యపాన ప్రియుల సంఖ్య తగ్గలేదు. ఇటు మద్యం డిపోలో నాణ్యమైన సరుకు ఫుల్‌గా ఉంది.అయినా ప్రభుత్వ ఖజానాకు రాబడిలో మాత్రం గండి పడుతోంది. అమ్మకాల్లో పెద్దగా పెరుగుదల కనిపించడం లేదు. కూటమిప్రభుత్వంలో నాణ్యమైన మద్యం అందుబాటులోకి వచ్చింది.పైగా అధిక ధరలకూ కళ్లెం పడింది. అయితే ఇప్పుడు మద్యం అమ్మకాల్లో చిత్రమైన పరిస్థితి కానవస్తోంది. నాణ్యమైన సరుకు ఫుల్లుగా అందుబాటులో ఉన్నా అమ్మకాలు నీరసంగా జరుగుతున్నాయి.లాభాలు అటుంచితే నష్టాలను మూటగట్టుకుంటున్నామంటూ మద్యం వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కమీషన్‌ని 14 శాతానికి పెంచడానికి అంగీకరించినా మద్యం అమ్మకాలు ఇలాగే నీరసంగా ఉంటే ఫలితం ఉండకపోవచ్చనే వాదన వినవస్తోంది.జిల్లాలో స్థిమితం లేని మద్యం అమ్మకాలపై ప్రత్యేక కథనం.

- దుకాణాల్లో 200 రకాల బ్రాండ్లు
- డిపోలో లక్ష కేసులు నిల్వ
- అమ్మకాల్లో మాత్రం నీరసం
- ప్రభుత్వ ఖజానాకు గండి
- పెరిగిన సారా తయారీ
- పట్టించుకోని ఎక్సయిజ్ శాఖ
- కమీషన్ పెంపుతో కాస్త ఊరట

సరుకు ఫుల్..అమ్మకాలు నిల్

వైసీపీ హయాంలో జగన్ పిచ్చి మందు అందుబాటులో ఉండేది. కూటమి ప్రభుత్వంలో టిన్ బీర్లతో సహా దాదాపు 200 రకాల బ్రాండ్ల సరుకు వస్తోంది.ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నిండా మద్యం ఉంది. కానీ అమ్మకాలు మాత్రం పడిపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మద్యం రోజుకు రూ.2 కోట్ల మేర అమ్మకాలు ఉంటే..ఇప్పుడు 200 రకాల బ్రాండ్లు అందుబాటులో ఉన్నా అంతే విక్రయాలు ఉండడం గమనార్హం.రాజమహేంద్రవరం డిపోలో సుమారు లక్ష కేసుల వరకూ నిల్వ ఉండగా.. రోజుకు సరాసరిన 5 వేల కేసులు మాత్రమే వెళుతోంది. సరిగా అమ్మకాలు లేక దుకాణదారులు ఆచితూచి ఇండెంట్ పెడుతున్నారు.కూటమి ప్రభుత్వం చీప్ లిక్కర్ రూ.99 చేయగా.. ఎక్కువగా అమ్ముడయ్యే బ్రాండ్ల ధరలు నేలకు దించింది.

పూటుగా సారా!

ప్రైవేటు బ్రాంది షాపుల కేటాయింపులో మండల కేంద్రాలను మాత్రమే యూనిట్‌గా తీసుకున్నారు. దీంతో గ్రామాల్లో మద్యం దుకాణాలు లేకుండా పోయాయి. ఇదిలా ఉండగా నగరాలు, గ్రామాలు తేడా లేకుండా సారా పూటుగా దొరుకుతోంది. దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టు,గోదావరి లంకల్లో సారా తయారీ కుటీర పరిశ్రమగా మారింది. సారాను గుట్టు చప్పుడు కాకుండా తయారుచేసి పట్టణాలు, పల్లెలకు తరలిస్తున్నారు. ఉదాహరణకు జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం నగరంలో సీటీఆర్ఐ పనస చెట్టు సెంటర్, క్వారీ మార్కెట్ అన్న క్యాంటీన్ సమీపంలో పగలూ రాత్రీ తేడా లేకుండా సారా అమ్ముతున్నా ఎక్సయిజ్ అధికారులకు మాత్రం 'ఎందుకనో' వాసన రావడం లేదు. దీంతో ప్రభుత్వం రూ.99కే నాణ్యమైనా చీఫ్ లిక్కర్ ఇస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ఏదేమైనా అటు జనాల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు సారా వల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ శాఖ వల్లే సర్కారు ఆదాయానికి చిల్లు పడుతోందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

బార్లలోనూ ఎంఆర్‌పీ!

బార్ల అమ్మకాల పరిస్థితి కూడా అధ్వానంగా తయారైంది. ఒకప్పుడు రోజుకు రూ.2లక్షల విక్రయాలు జరిగే బార్‌లో ఇప్పుడు రూ.50వేలు దాటడం కష్టమవుతోంది. బార్‌ల యజమానులు ఈ ఏడాది సెప్టెంబరు వరకూ ప్రభుత్వానికి (గత ప్రభుత్వం) లైసెన్సు ఫీజును కట్టేశారు. దీంతో అప్పటి వరకూ పర్మిట్ రూమ్‌లు ఇవ్వకూడదని బార్‌ల యజమానులు ఎక్సైజ్ శాఖను కోరారు. కొత్త మద్యం పాలసీలో భాగంగా ఆ అంశంపై ఎక్సైజ్ శాఖ సానుకూలంగా స్పందించింది. తీరా ప్రైవేటు మద్యం షాపులు వచ్చాక తీరు మారిపోయింది. ముఖ్యంగా మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లు లేకపోయినా అనధికారికంగా అమలు చేస్తున్నారు. మద్యం షాపుల వద్దే బహిరంగంగా మద్యం సేవిస్తున్నా ఎక్సైజ్ అధికారులకు కానరావడం లేదు.దీంతో బార్లలో సేల్స్ పడిపోయింది. రోజూ నష్టాలు చూసే బదులు బార్‌లకు తాళాలు వేసి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కి ఇచ్చేద్దామనే ఆలోచన చేసిన బార్‌ల యజమానులు.. ప్రభుత్వం కమిషన్‌ని సవరించడంతో తాము కూడా ఎంఆర్‌పీ ధరలకు అమ్మడానికి సిద్ధపడుతున్నారు.

సత్యదేవుడి సన్నిధిలో

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పూజలు



సుప్రీంకోర్టు న్యాయమూర్తికి సత్యదేవుడి చిత్రపటం అందజేస్తున్న ఈవో, సత్యదేవుడి దర్శనానంతరం హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి

అన్నవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె.మహేశ్వరి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వేర్వేరుగా స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్లసుబ్బారావు ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతంపలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

2025-26కి రూ. 162.55 కోట్లతో

అన్నవరం ఆలయ అంచనా బడ్జెట్

అన్నవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి ఆలయానికి సంబంధించి 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1625525000 అంచనా ఆదాయం వస్తోందని లెక్కించారు. అయితే వ్య యానికి సంబంధించి రూ.1621325000 వ్యయంగా అంచనా వేశారు. ఆదాయానికి సంబంధించి వ్రతాల ద్వారా రూ.50కోట్లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.40కోట్లు, లీజుల విభాగం ద్వారా రూ.15 కోట్లు, సత్రంగదుల అద్దెల ద్వారా రూ.10కోట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీలద్వారా రూ.6కోట్లు అంచనా ఆదాయంగా లెక్కించారు. వ్యయాలకు సంబంధించి ప్రధానంగా ఉద్యోగుల జీతభత్యాలు, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్లు, శానిటేషన్ నిర్వహణ, రసవర్గాలు కొనుగోలుకు నెలకు రూ.12 కోట్లు ఖర్చుచేయాల్సి ఉండగా వీటికే ఏడాదికి సుమారు రూ.140 కోట్లు వరకు వ్యయమవుతుంది. మొత్తంమీద రానున్న ఆర్థిక సంవత్సరంలో స్వామివారి ఖజానాకు సుమారు రూ.42లక్షలు మాత్రమే మిగులు బడ్జెట్‌గా అంచనా వేశారు. ఈ అంచనా బడ్జెట్ దేవదాయ కమిషనర్ ఆమోదం మేరకు హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

పెరుగుతున్న గోదావరి నీటి మట్టం

● డెల్టా కాలువలకు 8500 క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గోదావరి నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతోంది. నీటిమట్టం తగ్గిపోతుండడంతో సీలేరు నుంచి పవర్ జనరేషన్ ద్వారా వచ్చే 4వేల క్యూసెక్కులతోపాటు నేరుగా మరో 3వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. దీంతో 9.40 అడుగులకు తగ్గిన నీటిమట్టం ఆదివారం నాటికి 9.55 అడుగులకు పెరిగింది. నీటిలభ్యత 8654 క్యూసెక్కులుగా ఉండగా డెల్టాకాలువకు 850 0 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 2600క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1600 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కెనరా బ్యాంకులో కొనసాగుతున్న విచారణ

● బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో గోల్డ్ అప్రైజర్‌పై కేసు నమోదు

తునిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణరైతులనే లక్ష్యంగా చేసుకుని కొదవుపెట్టిన కోటికి పై బడి బంగారాన్ని గోల్‌మాల్ చేసిన వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది. ఇప్పటికే ఖాతాదారులు బ్యాంకు చుట్టూ తిరుగుతూ ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంక్ అధికారులు గోల్డ్‌లోన్ వ్యవహారంలో అవకతవకలకు పాల్పడిన ముగ్గురు సిబ్బందిని సస్పెం డ్ చేసి తుని రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా తేటగుంట కెనరా బ్యాంకులో గోల్డ్ గోల్‌మాల్‌లో సూత్రధారిగా ఉన్న గోల్డ్ అప్రైజర్ రామోజీల శేఖర్‌పై కేసు నమోదు చేసినట్లు తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు. ఇదిలావుంటే బాధితులపక్షాన తుని ఎంపీపీ బొప్పన రాము బ్యాంకుకు చేరుకుని అధికారులతో చర్చలు జరిపారు. బంగారం కోల్పోయిన ఖాతాదారులకు ప్రస్తుత బంగారం మార్కెట్‌కు అనుగుణంగా పరిహారం చెల్లించాలని బ్యాంక్ అధికారులను కోరారు.



రెండోరోజు జోష్

● హోరాహోరీగా హాకీ టోర్నమెంట్ ● ఆర్ఎస్సీ హైదరాబాద్, ముంబై, రాయ్‌పూర్, చత్తీస్‌గడ్ సెక్రటేరియట్, తెలంగాణ, ఢిల్లీ, ఒడిసా, మహారాష్ట్ర జట్ల విజయం



కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 16(ఆంధ్ర జ్యోతి): కాకినాడజిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ రెండోరోజు ఆదివారం టోర్నమెంట్ హోరాహోరీగా సాగింది. తొలుత ఆర్ఎస్సీ హైదరాబాద్, ఆర్ఎస్సీ కొచ్చి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్సీ హైదరాబాద్ 8-1తేడాతో ఆర్ఎస్సీ కొచ్చిపై విజయం సాధించింది. ఆర్ఎస్సీ చండీఘర్, ఆర్ఎస్సీ ముంబై జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్సీ ముంబై 5-1 తేడాతో ఆర్ఎస్సీ చండీఘర్‌పై విజయం సాధించింది. అలాగే ఆర్ఎస్సీ సిమ్లా, ఆర్ఎస్సీ రాయ్‌పూర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్సీ రాయ్‌పూర్ జట్టు 6-2తేడాతో ఆర్ఎస్సీ సిమ్లాపై విజయం సాధించింది. చత్తీస్‌ఘడ్ సెక్రటేరియట్, గుజరాత్ సెక్రటేరి యట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో చత్తీస్‌ఘడ్ సెక్రటేరియట్ జట్టు 13-0తేడాతో గుజరాత్ సెక్రటేరి యట్ జట్టుపై విజయం సాధించింది. మధ్యప్రదేశ్, తెలంగాణ జట్లమధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 4-3తేడాతో మధ్యప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది. కేరళ సెక్రటేరియట్ జట్టు, ఢిల్లీ సెక్రటేరి యట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ సెక్రటేరియట్ జట్టు 9-0తేడాతో కేరళ సెక్రటేరియట్ జట్టుపై విజయం సాధించింది. పాండిచ్చేరి సెక్రటేరియట్ జట్టు, ఒడిసా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిసా సెక్రటేరియట్ జట్టు 6-0తేడాతో పాండిచ్చేరి జట్టుపై విజయం సాధించింది. గోవా సెక్రటేరియట్ జట్టు, మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర సెక్రటేరియట్ జట్టు 18-0తేడాతో గోవా సెక్రటేరియట్ జట్టుపై విజయం సాధించింది. కార్యక్రమంలో డీఎస్‌డీవో శ్రీనివాసకుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న హాకీ టోర్నమెంట్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. శ్రీకృష్ణ కోలాటం బృం దం ఎంతో ఆకట్టుకుంది. అలాగే శ్రీభరత్ లిఖిత ఆర్కెస్ట్రా, ఆర్ టెక్నో రాక్ బ్యాండ్‌లు నిర్వహించిన కార్యక్రమాలు క్రీడాకారులకు ఎంతో వినోదాన్ని అందించాయి.




హోరాహోరీగా జరుగుతున్న హాకీ పోటీలు



సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

2028లో నేషనల్ గేమ్స్‌కి కాకినాడ వేదిక కావాలి



దాసరి మురళీకృష్ణ ఇన్‌కంట్యాక్స్ తెలంగాణ

1999 2001 వరకు 36 అంతర్జాతీయ టోర్నమెంట్లు ఆడారు. భారతదేశం తరుపున హాకీ టోర్నమెంటులో పాల్గొన్నా. 2028లో జరగనున్న నేషనల్ ఒలింపిక్స్‌కి ఏపీ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వాలని మొగ్గుచూపుతుంది. అదే జరిగితే కాకినాడ వేదికగా నిలవాలని అందుకు అనువైన గ్రౌండ్ ఇక్కడ ఉంది. ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్ జాతీయ అంతర్జాతీయ టోర్నమెంట్లకు అనువైన గ్రౌండ్ అందుకు అనుకూలంగా క్లబ్ లైట్స్ గ్యాలరీ ఏర్పాటుకు చీక్రీడా స్ఫూర్తితో కలెక్టర్ షణ్మోహన్ సగిలి 8.50 కోట్లు కేటాయించడంతో హాకీ క్రీడాకారులకు ఎంతో ఉప యోగకరంగా మారింది. గతంతో హాకీ క్రీడాకారులు ఇటువంటి గ్రౌండ్‌లో ప్రాక్టీస్ కోసం హైదరాబాద్ వెళ్లాల్లి వచ్చేది. ఇప్పుడు కాకినాడలో అందు బాటులో ఉంది. భవిష్యత్ క్రీడాకారులకు ఇది ఎంతో శుభపరిణామం.

హాకీ టోర్నీ కాకినాడలో జరగడం గర్వకారణం

● రవిచంద్రప్రసాద్ కడియాల ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇన్‌కంటాక్స్ కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్



రవిచంద్రప్రసాద్ కడియాల

కార్పొరేషన్(కాకినాడ),ఫిబ్రవరి(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సర్వీసెస్ హాకీ టోర్నీకి వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన 44 జట్లు కాకినాడలో ఆడడం చాలా గర్వకారణం. ప్రభుత్వ సహకారంతో పాటు జిల్లా కలెక్టర్ హాకీ టోర్నమెంట్‌కు అనుకూలమైన గ్రౌండ్ తయారుచేయడానికి నిధులు కేటాయించడంతో ఇదంతా సాధ్యమైంది. జాతీయ, అంతర్జాతీయస్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఈ గ్రౌండ్ ఎంతో ఉప యోగకరంగా ఉంటుంది. కాకినాడలో పుట్టిపెరిగిన నేను హాకీ బ్యాట్ ప ట్టుకుని 1986 నుంచి 1989 వరకు అనేక జాతీయస్థాయి టోర్నమెంట్లు ఆడాను. తెలంగాణ హాకీ ఇన్‌కంట్ ట్యాక్స్ టీమ్‌గా న్యూఢిల్లీ ఇంటర్‌నేషనల్ టీమ్‌గా పనిచేసున్నా. హాకీ మీద ఉన్న అభిమానంతో కాకినాడలోనే కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేసి 25మంది అమ్మాయిలు, 25మంది అబ్బాయిలను క్లబ్ తరుపున దత్తత తీసుకుని వారికి కావాల్సిన కిట్లు ఏర్పాటుచేసి సౌకర్యాలు కల్పించి మెరుగైన హాకీ క్రీడాకారులుగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకున్నాం.



బ్యాలెట్ బాక్సుల వినియోగంపై శిక్షణలో పీవో, ఏపీవోలు (ఫైల్‌ఫొటో)

ఎమ్మెల్సీ ఎన్నికకు రెడీ

» మిగిలింది 10 రోజులే
» 6 జిల్లాల్లో పట్టభద్రులు సిద్ధం
» 456 పోలింగ్ కేంద్రాలు
» 2 వేల మంది విధులు
» 22న తుది విడత శిక్షణ

ఏలూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ గడువు పది రోజులు లోపే ఉండడంతో ఎన్నికల నిర్వహణకు యంత్రాంగం కసరత్తులు చేస్తోంది. ఇప్పటికే ఒక విడత శిక్షణ పూర్తి.22న మరోసారి పీవో, ఏపీవోలు,ఇతర సిబ్బందికి శిక్షణలు పూర్తి చేయనున్నారు. మోడల్ కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే.ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పోలింగ్ నిర్వహిస్తారు. దాదాపుగా 2 వేల పైబడి అధికార,సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహించనున్నారు. 456 పోలింగ్ కేంద్రాల్లో ఒక పీవోతో పాటు ఏపీవో మరో ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ విధుల్లో ఉండనున్నారు. ఆరు జిల్లాల్లో కలిపి మొత్తం 456 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 456 మంది మైక్రో అబ్జర్వర్లు, 456 మంది వెబ్ కాస్టింగ్ చేయనున్నారు. పోలింగ్ సరళిని వెబ్‌కాస్టింగ్‌తో నిఘా పెట్టనున్నారు. అదనంగా 20 శాతం రిజర్వ్‌లో అధికారులు, సిబ్బంది కూడా ఎన్నికల విధులకు సిద్ధం అయ్యారు.ఆరు జిల్లాల పరిధిలో ఎన్నికలు జరుగుతుండడంతో ప్రతి జిల్లాలో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు 10 మంది జోనల్ ఆఫీసర్లు చొప్పున మండల లేదా, డిప్యూటీ తహశీల్దార్ కేడర్‌లోని అధికారులు పనిచేస్తారు.

26న పోలింగ్ సామగ్రి తరలింపు..

జిల్లా కేంద్రాల్లో 26న ఉదయం పోలింగ్ మెటీరియల్‌తో ఎన్నికల సిబ్బంది రూట్ ఆఫీసర్ల పర్యవేక్షణలో బస్సుల్లో బ్యాలెట్ బాక్సుల, ఇతర సామగ్రితో తరలివెళ్లనున్నారు. ఆయా జిల్లాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద 25వ తేదీ రాత్రికే ఏర్పాట్లను ఆయా జిల్లా కలెక్టర్లు పూర్తి చేస్తారు. 27న తర్వాత పోలింగ్ పూర్తయ్యాక ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు పోలింగ్ కేంద్రాల వరుస ప్రకారం భద్రపరచనున్నారు.ఈ ప్రక్రియ అంతా పోలీస్ యంత్రాంగం ద్వారానే జరగనుంది.

ప్రకటనలకు ఆమోదం తప్పనిసరి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెట్రిసెల్వి

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటలనకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ఆమోదం పొందాల్సి ఉంటుందని ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె వెట్రిసెల్వి తెలిపారు.ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడు రోజుల ముందు సంబంధిత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియామవళి ప్రకారం 25వ తేదీ సాయంత్రం 4 గంటకల్లా ప్రచారానికి తెరపడుతుందన్నారు.

యువకుడి కిడ్నాప్

● పిఠాపురం తీసుకువెళ్లి బీరు బాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి ● సిగరెట్లతో కాల్చి చిత్రహింసలు
● మానవతా దృక్పథంతో సాయం చేసినందుకు ఫలితం ● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



దాడిలో గాయపడిన ఉమ్మిడి గోవిందు

గొల్లప్రోలు, ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి): యువకుడిని కిడ్నాప్‌చేసి బీరు బాటిళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేయడమేగాక సిగరెట్లతో కాల్చి చిత్రహింసలకు గురిచేసిన సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చిం ది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణం దేవీనగరం ప్రాంతానికి చెందిన ఉమ్మిడి గంగాధర్ టైల్స్ పనిచేసుకుని జీవనం సాగిస్తూ ఉంటాడు. రోజు మాదిరిగానే ఈనెల 11వ తేదీన రాత్రి 10.30గంటల సమయంలో పని పూర్తి చేసుకుని సురేష్ కల్యాణ మండపం మీదుగా ఇంటికి వెళుతుండగా ఇరు వర్గాలు అక్కడ కొట్లాడుకుంటున్నాయి. ఈ ఘర్షణలో పిఠాపురం పట్టణంలోని రథాలపేటకు చెందిన వ్యక్తికి గాయాలయ్యాయి. అతన్ని మానవతా దృక్పథంతో నీరు అందిస్తుండగా రథాలపేటకు చెందిన చిన్న, పెద్ద, ఆకాష్, గొల్లప్రోలుకు చెందిన గణేష్, అంజి తదితరులు అతడిని బలవంతంగా పట్టుకుని మోటార్‌సైకిల్ లాక్కొని పిఠాపురం తీసుకువెళ్లారు. రథాలపేటలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడ బీరు బాటిళ్లు, ఇనుపరాడ్లుతో విచక్షణా రహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. వంటిపై సిగరెట్లు కాల్చి చిత్రహింసలకు గురిచేశారు. రాత్రంతా హింసించి గాయపరిచిన వారు గంగాధర్‌ను తీసుకువచ్చి గొల్లప్రోలు టోల్ గేట్ వద్ద తెల్లవారుజాము సమయంలో పడవేశారు. మోటార్‌సైకిల్‌ను వారి వద్దే ఉంచుకోవడంతోపాటు అతని జేబులో ఉన్న రూ.3,800 లాక్కొన్నారు. అతను ఆసుపత్రిలో చికిత్స పొంది గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశా రు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పోలీసింగ్‌పై విమర్శలు

యువకుడిని కిడ్నాప్‌చేసి పిఠాపురం పట్టణంలో చిత్రహింసలకు గురిచేసిన సంఘటన పిఠాపురం నియోజకవర్గంలో సంచలనంగా మారింది. పిఠాపురంలో పోలీసింగ్ తీరుపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బహిరంగంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ బదిలీ కావడం, పోలీసులు పిఠాపురం పట్టణంలో తనిఖీలు, రాత్రిపూట గస్తీలంటూ కొద్దిరోజులు హడావుడి చేశారు. తర్వాత మరలా పోలీసింగ్ అంతంత మాత్రంగానే మారింది. రాత్రిపూట పోలీసులు గస్తీ తిరుగుతూ ఉంటే యువకుడిని కిడ్నాప్‌కు తీసుకువెళుతున్నప్పుడు లేదా అతనిని నిర్మానుష్య ప్రదేశంలో చిత్రహింసలకు గురిచేసినప్పుడు గుర్తించి కాపాడే వీలుండేదని పలువురు వాఖ్యానిస్తున్నారు. యువకుడిపై దాడి చేసిన వారు అందరూ మద్యంమత్తులో ఉన్నట్లు చెబుతున్నారు. ఈ తరహా సంఘటనలు వెలుగులోకి వచ్చిన తర్వాత పోలీసుల్లో అంతగా కదలిక కనిపించకపోవడం విస్మయానికి గురిచేస్తుంది.

4.3 కిలోల గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్టు

గండేపల్లి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు, సిబ్బంది గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట వద్ద తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో బైక్‌పై వెళుతున్న ముగ్గురు వ్యక్తులను ఆపి పరిశీలించగా వారి వద్ద గంజాయి ఉన్నట్లు గుర్తించారు. 4.3 కిలోల గంజాయి, ఒక మోటారు సైకిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. రాజవొమ్మంగికి చెందిన కెకె సాగర్, మాడుగులకు చెందిన కేపి కుమార్, సామర్లకోటకు చెందిన పీకే కృష్ణను అరెస్టు చేశారు. కిర్లంపూడికి చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్టుచేసిన వారిని కోర్టులో ప్రవేశపెట్టగా 14రో జులు రిమాం డ్ విధించినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. మొత్తం సొత్తు విలువ రూ.61,500 ఉంటుందన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

ఐ.పోలవరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం రాత్రి ఈదుర్ఘటన జరిగింది. దూకిన వ్యక్తి పశువుల్లంకకు చెందిన చింతలపూడి శ్రీనివాసరావు(66)గా పోలీసులు గుర్తించారు. అన్నంపల్లి అక్విడెక్టు సమీపంలో ఆదివారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. అమలాపురానికి చెందిన అల్లుడు బీమాల రవికుమార్ వేధింపులు భరించలేక తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుని భార్య అమ్మాజీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్నేళ్లుగా తన కుమార్తెకు విడాకులు ఇవ్వకుండా అల్లుడు మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ముమ్మిడివరం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

● బైక్‌ను ఢీకొట్టిన జామాయిల్ లోడ్ ట్రాక్టర్
● ఎటపాక నవోదయా సమీపంలో ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భార్యాభర్తలు రాంబాబు, ముత్యాలమ్మ(ఫైల్)

ఎటపాక, ఫిబ్రవరి 16 ఆంధ్రజ్యోతి: బైక్‌ను ఎదురుగా వస్తున్న జామాయిల్ కర్రల లోడ్ ట్రాక్టర్ ఢీకొని భార్యాభర్తలు మృతి చెందిన ఘటన ఆదివారంరాత్రి అల్లూరిజిల్లా ఎటపాక మండలంలో జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో చోటు చేసుకుంది. ఈఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెంజిల్లా దుమ్ముగూడెం మండలం మారాయిగూడెం పంచాయతీ లోని భీమవరం గ్రామానికి చెందిన సోయం రాంబాబు(52) సోయం ముత్యాలమ్మ(45) భార్యాభర్తలు. ఇరువురు భద్రాచలం వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి ఎటపాక మీదుగా తెలంగాణలోని భీమవరంనకు వెళుతున్నారు. ఈక్రమంలో లక్ష్మీపురం వైపు నుంచి జామాయిల్ లోడ్‌తో ఎటపాక వైపు వస్తున్న ట్రాక్టర్ నవోదయ విద్యాలయం సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో భార్యాభర్తలు ఇరువురు తీవ్రగాయాలతో అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వెంటనే క్షతగ్రాతులను భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వైద్యులు పరీక్షించి ఇద్దరు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా భావనారాయణస్వామి తిరునాళ్లు

● పోటెత్తిన వేలాది మంది భక్తులు
● ఒక్కరోజే రూ. 5లక్షల ఆదాయం



పాలపొంగలి తయారు చేస్తున్న భక్తులు

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి):శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో స్వామివారి జన్మదినం, తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. మాఘమాసం మూడో ఆదివారం తిరునాళ్ల, స్వామి జన్మదినోత్సవ పర్వదినాలు ఒకేరోజు కలసి రావడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు ఉమ్మడిజిల్లా నుంచే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటూ కర్నాటక, మహారాష్ట్ర నుంచి సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెల్లవారుజాము 4 గంటల నుంచే స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించి మేల్కొలిపిన అనంతరం భక్తులకు దర్శనం అనుమతించారు. ముందుగా భక్తులు భావనారాయణస్వామిని దర్శించుకున్న అనంతరం ఆలయం ఈశాన్యదిక్కులోఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయంలో ఉన్న ఆదిశేషు శ్రీభావనారాయణస్వామిని అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన పాలపొంగులను ఆవుపిడకల పొయ్యిపై ఆవుపాలతో పరమాణ్ణం వండి నైవేద్యం సమర్పించారు. మాఘమాసంలో స్వామి వారిని దర్శించుకుంటే దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాల్లోఉన్న శైవక్షేత్రాలను దర్శించుకున్న ఫలితం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో ఎం.లక్ష్మీనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు, సౌకర్యాలు, వసతి కల్పించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, అరుణ దంపతులు, కుమారుడు సందీప్‌ల ఆధ్వర్యంలో 25 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు వివిధ కానుకల రూపంలో హుండీలు, దర్శనం, సేవలు, ప్రసాదం, అన్నదానం ద్వారా రూ.5,00,300 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో లక్ష్మీ నారాయణ తెలిపారు.

కత్తిపూడి ప్రమాదంలో వ్యక్తి మృతి

● మరో ఇద్దరికి గాయాలు




మృతిచెందిన సత్యనారాయణ

శంఖవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కత్తిపూడి 16వ నెంబరు జాతీయరహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన నక్కా సత్యనారాయణ (50) మృతిచెందగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చెందుర్తి గ్రామానికి చెందిన మృతుడు కత్తిపూడి వచ్చి తన ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతుండగా మరో ద్విచక్రవాహనం వెనుకనుంచి ఢీకొట్టడంతో సత్యనారాయణ తలకు బలమైన గాయంకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగ్రాతులను ప్రత్తిపాడు ఏరియా ఆసుపత్రికి తరలించగా, మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొని యువకుడి మృతి

● మరొకరికి గాయాలు



మృతి చెందిన దోకాడ రవికుమార్

తునిరూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న వాహనాన్ని ఢీ కొని ఒక యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన తుని పట్టణ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పట్టణంలోని డీ మార్ట్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన ఈ సంఘటనలో విజయనగరంజిల్లా విలుపర్తి గ్రామానికి చెందిన దోకాడ రవికుమార్(25) రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి చెందిన నకిరెడ్డి కిల్లాడి ఇద్దరు యువకులు అన్నవరం ఓ వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళుతుండగా ప్రమాదం జరిగింది. తుని పట్టణంలోని డీ మార్ట్ సమీపంలో ఆగి ఉన్న వ్యాన్‌ను బలంగా ఢీ కొట్టడంతో రవికుమార్(25)అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి స్నేహితుడు కొల్లాడి తీవ్ర గాయాలపాలయ్యాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన తుని పట్టణ పోలీసులు గాయాలపాలైన వ్యక్తిని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తుని పట్టణ సీఐ గీతా రామకృష్ణ తెలిపారు.

రోడ్లపైకి ఇసుక

» లారీల నుంచి జారి పడుతున్న వైనం
» పట్టించుకోని పంచాయతీ సిబ్బంది
» ధవళేశ్వరంలో యువత శ్రమదానం


ధవళేశ్వరంలో రోడ్లపై ఇసుకను ఎత్తిపోతున్న యువకులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ర్యాంపుల నుంచి ఇసుకను తీసుకువెళ్లే లారీల నుంచి జారిపడుతున్న ఇసుక రోడ్లపై మేటలు వేస్తుండడంతో ద్విచక్రవాహనదారులు ఆ ఇసుకలో జారిపడి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పంచాయతీ అధికారి,పారిశుధ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు దీనిని గమనించి రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించడానికి నడుం బిగించారు. ఆదివారం ఉదయం కాటన్ బ్యారేజ్ రోడ్డులో చీపురులు చేతబట్టి రోడ్డుపై ఉన్న ఇసుకను పారలు, గమేళాలతో ఎత్తిపోశారు. ర్యాంపుల నుంచి అధిక లోడుతో ఇసుకలారీలు రాజమహేంద్రవరం వైపు వెళ్లే రహదారులు, వేమగిరి వైపు వెళ్లే రహదారుల్లో ఇసుకను జార్చుకుంటూ వెళ్తుండడం, లోడు లారీపై చాలీచాలని బరకాలను కడుతుండడం వల్ల ఎఫ్‌సీఐ గోడౌన్, సాయిబాబా గుడి, కాటన్ బ్యారేజ్, తదితర ప్రాంతాల్లో రోడ్డుపై ఇసుక పోగుబడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక కోరుతున్నారు. శ్రమదానంలో ఒంటెద్దు స్వామి, తలాటం సూర్యప్రకాశరావు, గుజ్జల సూరిబాబు, కె.జగన్నాథరావు, పి.ధనంజయ్, శేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాయి బాబా ఆలయ వార్షికోత్సవం

చాగల్లు, ఫిబ్రవరి 16, (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం పక్కనున్న సాయిబాబా ఆలయంలో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేతా సురేష్ దంపతులు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. సాయంత్రం కేశరి బాలమిత్ర మండలి భజన చేశారు. భక్తులు విశేషంగా విచ్చేసి స్వామి వారి పూజల్లో పాల్గొన్నారు.

నరికేయడం..వదిలేయడం..

» విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం
» విద్యుత్ లైన్లకు అడ్డొస్తున్న చెట్ల కొమ్మల తొలగింపు
» బయటకు తరలించకుండా రోడ్డును చేర్చి వదిలేస్తున్న వైనం
» పట్టించుకోని గ్రామ పంచాయతీ అధికారులు
» ఇబ్బందులు ఎదుర్కొంటున్న ధవళేశ్వరం గ్రామస్థులు


కొమ్మలను నరికి రోడ్డుపై పడేసిన విద్యుత్ సిబ్బంది

ధవళేశ్వరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం ప్రజలకు శాపంగా మారింది. ధవళేశ్వరం విద్యుత్ శాఖ పరిధిలో ప్రమాదాలు నివారించడానికి విద్యుత్ లైన్ల కింద పెరుగుతున్న చెట్ల కొమ్మలను నరికి తొలగిస్తుంటారు. నరికి వేసిన చెట్లు, కొమ్మలు ఎక్కడవి అక్కడే వదిలి వేయడంతో అవి రోడ్లకు అడ్డంగా ఉండి ప్రమాదాలు జరుగుతున్నాయి. కాల్వలో పడి మురుగు ప్రవాహానికి అడ్డంగా మారుతున్నాయి. వార్షిక మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ లైన్లకు తగులుతున్న కొమ్మలను నరకడంతో పాటు నరికిన కొమ్మలను వాహనం ద్వారా తొలగించాల్సిన విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వదిలివేస్తున్నారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది రోడ్లకు అడ్డంగా ఉన్న కొమ్మలను పక్కకు లాగి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఊరి చివరకు తరలించడం లేదు. దీంతో గ్రామ వీధుల్లో ఎండిన చెట్ల కొమ్మలు, రాలిన ఆకులతో చెత్తమయంగా మారుతున్నాయి. రోడ్డు పక్కకు చేర్చిన కొమ్మలతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం గ్రామ పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుని నరికి వేసిన కొమ్మలు తొలగించాల్సిన పనులను విద్యుత్ శాఖాధికారులు చేయాలి. అయితే అలా జరగడం లేదు. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా కాకుండా ఇప్పటికైనా పంచాయతీ, విద్యుత్ శాఖల అధికారులు అవగాహనకు వచ్చి కొమ్మలు తొలగించే పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.


రోడ్డు పక్కన పడేసిన చెట్ల కొమ్మలు

ముగిసిన త్రిమూర్తులుస్వామి తీర్థ మహోత్సవాలు


స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ

రాజానగరం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరేంద్రపురంలో పచ్చని పంట పొలాలు మధ్య స్వయంభూగా వెలసిన త్రిమూర్తులు స్వామి తీర్థ మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఐదు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా అనేక ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కూటమి నాయకులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

సినీ నిర్మాత కృష్ణవేణి అస్తమయం

» పంగిడిగూడెం నుంచి సినీ రంగానికి » గోదావరి జిల్లాల్లో విషాదఛాయలు


ప్రముఖ సినీ నిర్మాత కృష్ణవేణితో రాకా కార్యదర్శి రమణ

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆడవాళ్లు బయటకు రావాలంటేనే భయపడే రోజులవి.. అయినా ఆమె బయటకు వచ్చారు.. నిర్మాతగా మారి సినిమాలు నిర్మించారు.. ఎన్‌టీఆర్.. ఘంటసాలను సినిమా రంగానికి పరిచయం చేసింది ఆవిడే.. ఆమె పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన కృష్ణవేణి (102). ఆమె ఆదివారం హైదరాబాద్‌లోని స్వగృహంలో మృతిచెందడంతో ఉభయగోదావరి జిల్లాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె 1924లో జన్మించారు. స్వగ్రామం నుంచి కళాకారిణిగా అంచలంచెలుగా ఎదిగారు. అనేక నాటక సమాజాల్లో వేషాలు వేసి సినిమా రంగంలో ప్రవేశించారు. మీర్జాపూర్ రాజాను వివాహం చేసుకున్నారు.1936లో భర్తతో కలిసి శోభనాచలం స్టూడియోను నిర్మించి తొలిగా "సతీ అనసూయ" చిత్రాన్ని నిర్మించారు. ఆమె సొంతంగా 1948లో మన దేశం సినిమా నిర్మాతగా మారి టీడీపీ వ్యవస్థాపకులు ఎన్‌టీ.రామారావును మొట్టమొదటి సారిగా వెండి తెరకు పరిచయం చేయడంతో పాటు, మొదటి సారిగా ప్రముఖ గాయకుడు ఘంటసాలను సంగీత దర్శకుడిగా పరిచయం చేశా రు. అటు తర్వాత దాంపత్యం,భక్తప్రహ్లాద, కీలుగుర్రం,బాలమిత్రుల కథ వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించారు.ఆమె తరు వాత ఆమె కుమార్తె అనూరాధ కూడా అనేక హిట్ చిత్రాలను నిర్మించారు.వారికి రఘుపతి వెంకయ్య నాయుడు అవార్డును ప్రభుత్వం ఇటీవల అందించడం గర్వించదగ్గ విషయం. ఇటీవల విజయవాడలో ఆమె ఎన్‌టీఆర్ స్మారక అవార్డును అందుకున్నారు.

కృష్ణవేణి మృతి బాధాకరం

శత వసంతాలు నిండిన కృష్ణవేణి మృతి బాధాకరం. హైదరాబాదు వెళ్లినప్పుడల్లా ఆమెను కలుసుకుంటూ ఉండేవాడిని.. ఆమె ఆరోగ్యం కుదుట పడిన తరువాత రాజమహేంద్రవరంలో సత్కరించాలని భావించా. అయితే అది కోరికగానే మిగిలిపోయింది. తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది అని తెలుగు జాతి విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన ఎన్టీఆర్‌ను సినీ ప్రపంచానికి పరిచయం చేసిన కృష్ణవేణి జీవితం ధన్యం.

జీవీ రమణ, రాకా సంస్థ సెక్రటరీ, రాజమహేంద్రవరం.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు


బలభద్రపురంలో విద్యుద్దీపాల అంకరణలో సాయి మందిర

బిక్కవోలు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆం ధ్రా షిర్డీగా పేరొందిన బలభద్రపురం సాయి మందిర వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి ఆదివారం తెలిపారు. సోమవారం బాబాకు కాగ డా హారతి, గణపతి, దత్తాత్రేయ, ధుని పూజలు, 108 లీటర్ల పాలతో అభిషేకం, లక్షపత్రిపూజ, శ్రీరాజరాజేశ్వరిదేవికి లక్షకుంకుమార్చన, గో పూజ, హోమం, రథోత్సవం, పూర్ణాహుతి జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిరాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఘనంగా అన్నసమారాధన



రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక జెండా పంజా రోడ్డులోని బెస్తా వారి వీధిలో రజక సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాలమ్మ జాతర సందర్భంగా ఆదివారం ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని రజక సంఘం గౌరవాధ్యక్షుడు టేకి కాళిదాసు, బుడంపల్లి ఉమాశంకర్, బుడంపల్లి స్వామి వరప్రసాద్, కాకరపర్తి శ్రీనివాసరావు, బుడంపల్లి సురేష్, మల్లేశ్వరపు వీర్రాజు తదితరులు పర్యవేక్షించారు.

రాజశేఖర్ విజయానికి పాటుపడండి

» మొదటి ప్రాధాన్య ఓటుతో పేరాబత్తులను గెలిపించాలి
» రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్
» జనసేన గోదావరి జిల్లాల ప్రతినిధుల ఆత్మీయ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల, చిత్రంలో మంత్రి దుర్గేష్, అభ్యర్థి పేరాబత్తుల

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. జనసేన గోదావరి జిల్లాల ప్రతినిధులతో స్థానిక చెరుకూరి కల్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి వారిద్దరూ విచ్చేసి మాట్లాడారు. సమన్వయంతో ముందుకు వెళ్లాలని, మొదటి ప్రాధాన్య ఓటుతో పేరాబత్తులను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా రాజశేఖరంను మరోసారి అందరికీ పరిచయం చేశారు. సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, పంతం నానాజీ, పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీస్ రెగ్యులరైజేషన్‌ను పునఃప్రారంభించండి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ పునఃప్రారంభించాలని కాంట్రాక్టు లెక్చరర్స్ 475 అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం కోరారు. స్థానిక చెరుకూరి కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పిఠాపురం జనసేన నాయకులు జోగా వీరవెంకటరమణ, సూరంపూడి సురేష్, మార్నీడి రంగబాబు, వనం వీరబాబులతో కలిసి ఈ మేరకు వినతిపత్రం అం దించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ విషయాన్ని సంబంధిత శాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతల శ్యామ్‌కిరణ్, మూర్తి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపిద్దాం

» ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
» బత్తుల కిరణ్ సహా పలువురు టీడీపీలో చేరిక


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్థానిక దానవాయిపేట అద్దేపల్లి బీఈడీ కళాశాల వీధిలో ఆదివారం గైట్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ బత్తుల కిరణ్‌తో పాటు వందమంది విద్యావేత్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి వారిని కండువాలతో స్వాగతించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ పార్టీలో విద్యావేత్తలు చేరడం శుభపరిణామమని, రెట్టింపు ఉత్సాహంతో పనిచేద్దామన్నారు. గత ఐదేళ్ల రాష్ట్రాన్ని చీకటి రాజ్యమేలిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు కష్టపడి పేరాబత్తులను గెలిపించాలన్నారు. బత్తుల కిరణ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజారోగ్యం, నగర అభివృద్ధి, ప్రజా సమస్యలపై ఆయన స్పందిస్తున్న తీరు నచ్చి పార్టీ పట్ల ఆకర్షితులయ్యామని చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాస్, సత్యంబాబు, మజ్జి రాంబాబు, చల్లా శంకర్రావు, ఉప్పులూరి జానకిరామయ్య, బుడ్డిగ రాదా, రాచపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సముదాయ సమావేశాల సమయం మార్చాలి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ జయత్రినాథబాబు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అసౌకర్యంగా ఉన్న పాఠశాల సముదాయ సమావేశాల సమయాన్ని మార్పు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయత్రినాథబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దివాన్‌చెరువులో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. క్లస్టర్ కాంప్లెక్స్ పేరిట సెలవు మంజూరు చేయమని ప్రకటించడంతో బాటు, ఉదయం పాఠశాలలకు హాజరై మధ్యాహ్నం క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఒంటి గంటకు హాజరు కావాలని, సాయంత్రం 5.30 గంటల వరకూ సమావేశంలో పాల్గొనాలని అధికార్లు ఆదేశించడం, సమావేశం ముగిసినా ముఖ హాజరు పనిచేయకపోవడం వంటి చర్యలు ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సౌకర్యం కుడా లేని మారుమూల ప్రాంతాల్లో సమావేశాలకు హాజరైన ఉపాధ్యాయులు ముఖ్యంగా మహిళలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇది ఎంతో ఇబ్బంది కలిగించే అంశమని అన్నారు. ఈ అంశాలలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకుని క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం సమయాన్ని నాలుగు గంటల వరకే కుదించాలని జయత్రినాథబాబు కోరారు.

పేదలకు అండగా కూటమి

సీఎంఆర్ఎఫ్ పంపిణీలో ఎమ్మెల్యే గోరంట్ల


లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం/రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్థిక ఒడిదుడుకులున్నా పేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆదివారం ఆయన కడియం మండలం వీరవరం గ్రామానికి చెందిన దొంతంశెట్టి సత్తిరాజుకు రూ.37,180, రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట డి బ్లాక్‌కు చెందిన ఆత్కూరి నాగ వెంకట సత్యకుమారికి రూ.80 వేలు సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బొప్పన నానాజీ, పిన్నమరెడ్డి ఈశ్వరుడు,దొంతంశెట్టి శ్రీను, గోరు నాగేశ్వరరావు, గారపాటి నాగేశ్వరరావు, కొల్లి దుర్గాప్రసాద్, కె.శ్రీరామ్ పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై అవగాహన ఉందా?

మాజీ ఎమ్మెల్యేను విమర్శించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్తూరులో ఆలయ నిర్మాణాన్ని అడ్డుకున్నారంటూ హిందూ ధర్మం సనాతన ధర్మం అంటూ మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి సనాతన ధర్మంపై అవగాహన ఉందా అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల పాలనలో ఆలయాల వద్ద మాజీ ఎమ్మెల్యే దంపతులు చేసిన అపచారాలు అన్నీఇన్నీ కావన్నారు. ఆలయాల అభివృద్ధికి మంజూరైన నిధులను కూడా నిలుపుదల చేశారన్నారు. చిన పొలమూరులో విగ్రహాలను ప్రతిష్ఠ కాకుండా రాజకీయ లబ్ధి కోసం అడ్డుకోవడం ఏ ధర్మమని ఆయన ప్రశ్నించారు. మఠాధిపతులను కూడా మాజీ ఎమ్మెల్యే తప్పుదారి పట్టించారని విమర్శించారు. సమావేశంలో కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి బులిరెడ్డి, ఎన్ఆర్‌కె ప్రసాదరెడ్డి, చింతల రామకృష్ణ, ఒంటిమి సూర్యప్రకాష్, గొలుగూరి భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

రైల్వే మంత్రి రాజీనామా చేయాలి'

కొవ్వూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాంరవిప్రకాష్ డిమాండ్ చేశారు. కోట్లాది మంది భక్తులు కుంభమేళాకు వెళ్తున్నారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయక పోవడం బాధాకరమన్నారు. ఒక ట్రైన్‌కు సుమారు 1500 టిక్కెట్లు అమ్మడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయడానికి కాకుండా ఆదాయం కోసమే రైల్వేశాఖ పనిచేస్తోందని ఆరోపించారు.

తక్కువ ధరలకు దళారులకు అమ్మి మోసపోవద్దు

రైతు బజార్లలో పంటలను విక్రయించుకోవాలి: జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటలు పండించే రైతులు దళారులకు తక్కువ ధరలకు అమ్మి మోసపోవద్దని, పంటలను రైతు బజార్లలో విక్రయించుకుని గిట్టుబాటు ధరలను పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లాలో కూరగాయలను సాగు చేస్తున్న రైతులంతా తమ పంటలను రైతు బజార్లకు తీసుకురావడం ద్వారా మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం మార్కెటింగ్ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం జిల్లాలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున కూరగాయల పంటలు అంచనాలకు మించి దిగుబడి వస్తున్నాయని తెలిపారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర రాకపోవడంతో బయట పారవేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులు రైతు బజార్ల ద్వారా తమ పంటలను విక్రయించుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం రైతులు ఎస్టేట్ అధికారులు 99491 31315 (శ్రీనివాస్), 98493 33136 (వెంకటేశ్వరరావు, 90592 71999 (తేజ)లను సంప్రదించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్ వినయ్ పేర్కొన్నారు.

వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పోలీసు అధికారి

కోరుకొండ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే వారు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని శ్రీరంగపట్నంలో నిర్వహించిన డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గంజాయి, మద్యం, సారా, ర్యాష్ డ్రైవింగ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో జరిగే ఉత్సవాల్లో ఏ విధమైన అసాంఘిక కార్యక్రమాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలు గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా చూసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ నేరం జరిగిన వెంటనే 1930నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని, గంజాయి, డ్రగ్స్ విషయంలో ఈగల్ టీం నెంబర్ 1972కు కాల్ చేసి సమాచారం తెలపాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ విషయాలపై ప్రజల్లో పట్ల అవగాహన పెంపొందించేందుకే ఈ సదస్సు నిర్వహిస్తున్నామని సీఐ వై.సత్యకిషోర్ పేర్కొన్నారు.సదస్సులో ఎస్ఐ శ్యామ్ సుందర్, పలువురు గ్రామస్థులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

నిడదవోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శెట్టిపేట పవర్ ప్లాంట్ సమీపంలోని కాలువ వద్ద ఆదివారం ఒక వృద్ధుడు అనుమానాస్పదంగా మృతిచెంది కనిపించాడు. మృతుడు నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన గాడి వెంకటేశ్వరరావు (77)గా గుర్తించారు. దీనిపై పట్టణ ఎస్ఐ పరమహంస కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నరసన్న కొండపై ముగిసిన అధ్యయనోత్సవాలు


శ్రీ లక్ష్మీనరసింహస్వామి

కోరుకొండ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కోరుకొండలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కొండపైన ఉన్న రంగనాథ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ భూ సమేత అనంత పద్మనాభస్వామి ఆలయం వద్ద నిర్వహించిన అధ్యయనోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఐదు రోజులపాటు లక్ష్మీనరసింహస్వామి కొండపైన, 2 రోజులు రంగనాథస్వామి ఆలయం వద్ద, మరో 2 రోజులు అనంత పద్మనాభ స్వామి ఆలయం వద్ద ఈ అధ్యయనోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించామని పరాసర రంగరాజ భట్టర్ స్వామి తెలిపారు. ఈ నెల 8న ప్రారంభమైన ఈ అధ్యయనోత్సవాలు ఆదివారం రాత్రితో ముగిసినట్టు అన్నవరం దేవస్థానం అధికారులు, నరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ రంగరాజభట్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం ప్రత్యేక సేవాకాలం, తీర్థ ప్రసాద గోష్ఠి, బేడా ఉత్సవాలు, గ్రామోత్సవాలు వైభవంగా జరిగాయి.

రాజమహేంద్రవరంలో ఫస్ట్ ఆల్ బ్రీడ్ ఓపెన్ డాగ్ షో


ప్రదర్శనకు వచ్చిన శునకాలతో వాటి యజమానులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని మన్యం గార్డెన్స్‌లో గోదావరి కెన్నెల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చిన ఫస్ట్ ఆల్ బ్రీడ్ ఓపెన్ డాగ్ షో నిర్వహించారు. నగరంలోని సుమారు 200 పైబడి పెంపుడు శునకాలతో వాటి యజమానులు ఈ డాగ్ షోకు హాజరయ్యారు. వారి వివిధ రకల ఇండియన్ బ్రీడ్‌ల పెంపుడు శునకాలను ప్రదర్శించారు. ప్రదర్శన ముగింపులో ఉత్తమంగా ఉన్న శునకాలను గుర్తించి నిర్వాహకులు బహుమతులను అందించారు.

విద్యుత్ తీగ .. యమపాశమై

పురుషోత్తపల్లిలో యువ రైతు కూలి మృతి



నిడదవోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కరెంట్ తీగ అయన పాలిట యమపాశమైంది. అరటి తోటకు ఎరువు కొడుతుండగా ... ఊహించని రీతిలో మృత్యువు కాటేసింది. ఒక్కసారిగా వైరు తెగిపడడంతో యువ రైతు కూలి మృతి చెందాడు. ఈ హృదయ విదారక ఘటన పురుషోత్తపల్లిలో ఆదివారం జరిగింది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాలివి.. దేశాబత్తుల నరేష్(35) పందలపర్రులోని అరటి తోటకు వెళ్లి మందును స్ప్రే చేస్తుండగా వైరు తెగిపడింది. దీంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు వెళ్లి బోరున విలపించారు. తండ్రి విగతజీవిగా పడి ఉండడాన్ని చూసిన పిల్లల్ని ఆపడం ఎవరితరమూ కాలేదు. కాగా నరేష్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమిశ్రగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY




10 రోజుల్లోనే.. ఎమ్మెల్సీ ఎన్నిక

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక దగ్గరపడుతోంది.. ఈ నెల 27వ తేదీన ఎన్నిక జరగనుంది. ఇక మిగిలింది 10 రోజులే.. ఈ నేపథ్యంలో అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు.. పట్టభద్రులను కలిసి తమకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు.. మరో వైపు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాజమహేంద్రవరం చెరుకూరి కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి జనసేన గోదావరి జిల్లాల ప్రతినిధుల ఆత్మీయ సమావేశానికి మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరై కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు గెలిపించాలని పిలుపునిచ్చారు..

7,8 పేజీల్లో


కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు సన్మానం చేస్తున్న మంత్రులు నాదెండ్ల, దుర్గేష్

హాకీ..ఆడేశారు!

హాకీలో తలపడ్డారు.. నువ్వా నేనా అంటూ పోటీపడ్డారు.. గోల్స్ కొట్టేందుకు ఎగబడ్డారు.. ఎవరో కాదండోయ్.. కలెక్టర్లు.. ఎస్పీలు.. ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ కాకినాడలో రెండో రోజు ఆదివారం ఉదయం నుంచి హోరాహోరీగా సాగింది..ఎండను సైతం లెక్కచేయకుండా సివిల్ సర్వీసెస్ క్రీడాకారులు గెలుపుకోసం పట్టుదలగా ఆడారు. పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు హాజరై క్రీడాకారులకు మద్దతుగా నిలిచారు.. - వివరాలు 7లో


రెండో రోజు ఆదివారం హాకీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ప్రమాదంలో.. అడవి!



ఎలా జరిగింది : ఇటీవల దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో దగ్ధమవుతున్న అటవీ ప్రాంతం(ఫైల్)

తూర్పునకు 4 దిక్కులా రిజర్వు ఫారెస్టు ఇలా..

దివాన్‌చెరువు	- 2 వేల ఎకరాలు
నల్లజర్ల - ద్వారకాతిరుమల	- 3 వేల ఎకరాలు
గోపాలపురం మండలం	- 2 వేల ఎకరాలు
గోకవరం మండలం	- 18 వేల ఎకరాలు

అడవి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా కనీసం కన్నెత్తి చూసేవారే లేరు. ఒక పక్కన అడవి ఆక్రమణలు.. మరో పక్కన సారాబట్టీలు.. ఇంకో పక్కన వ్యభి చార కార్యకలాపాలు సాగుతున్నా కనీసం కట్టడి చేసే వారే కరువయ్యారు..జిల్లా కేంద్రం కావడంతో అటవీ శాఖలు చుట్టూ ఉన్నా.. పక్క జిల్లా కాకినాడలో అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఉన్నా అడవిని రక్షించేవారే కానరావడంలేదు. ఇటీవల అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఈ సీజన్‌లో ఇటువంటి ప్రమాదాలు సాధారణమేనని సాక్షాత్తూ అటవీ అధికారి కొట్టిపారేయడం తప్పనే వాదన వినిపిస్తోంది. ఈ అగ్ని ప్రమాదంపై స్థానికుల నుంచి పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కావాలనే నిప్పు పెట్టారా లేక అనుకోకుండా జరిగిన తప్పిదమా అనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి.ప్రమాదంపై విచారణ జరిపించి.. అటవీ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

రాజానగరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా ప్రత్యేకత ఏంటంటే జిల్లా కేంద్రాన్ని ఆనుకుని అటవీ ప్రాంతం ఉండడం.. ఈ అటవీ ప్రాంతం చుట్టూనే ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. అటవీ శాఖ అధికారులకు కూతవేటు దూరంలోనే ఆ రిజర్వు ఫారెస్టు ఉంది. అధికార యంత్రాంగం చుట్టూ ఉన్నందుకు ఫారెస్టు పచ్చదనంతో కళకళలాడుతూ ఉండాలి.పర్యవేక్షణ లేకపోవడంతో రిజర్వు ఫారెస్టు కాస్తా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది..ఇటీవల అటవీ ప్రాంతం దగ్ధం కావడంతో అందరి చూపు అడవిలో జరిగే కార్యకలాపాలపై పడింది. అటవీ అధికారులు ఈ సంఘటన సాధారణమేనని కొట్టిపారేసినా..నిప్పులేనిదే పొగ ఎక్కడ నుంచి వస్తుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు..ఆక్రమణలు



- జిల్లా కేంద్రంలోనే రిజర్వు ఫారెస్టు
- చుట్టూ అధికార యంత్రాంగం
- అయినా కన్నెత్తి చూసేవారే లేరు
- నిత్యం వ్యభిచార కార్యకలాపాలు
- సారా బట్టీలకు అడ్డా
- ఇటీవలే అగ్ని ప్రమాదం
- జిల్లా చుట్టూ వేలాది ఎకరాలు
- అయినా రక్షణ చర్యలు నిల్

జోరుగా సారా బట్టీలు..

తూర్పుగోదావరి జిల్లా కేంద్రం దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు సారా బట్టీల నిర్వహణకు అడ్డాగా మారింది. ఫారెస్టును ఆనుకుని దివాన్ చెరువు,హౌసింగ్ బోర్డు కాలనీ, లాలాచెరువు, శ్రీరాంపురం, శ్రీకృష్ణపట్నం, రఘునాథపురం, పిడింగొయ్యి, వెలుగుబంద, చక్రద్వారబంధం పరిసర గ్రామాలు, మామిడి, జీడీమామిడి పండ్ల తోటలతో పాటు రియల్ ఎస్టేట్ ప్లాట్లు ఉన్నాయి.దీంతో జనసంచారం అంతగా లేకపోవడంతో కొంతమంది సారా బట్టీల నిర్వహణకు అనువుగా మలచుకున్నారు.రాత్రి పగలు తేడా లేకుండా సారా తయారు చేస్తున్నారు. సారాను ఇక్కడ నుంచి సుదూర ప్రాంతాలకు బాటిళ్లు, టిన్నులు, కవర్లలో నింపి గుట్టు చప్పుడు కాకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరం.. జాతీయ రహదారి పక్కనే ఉన్న అడవిని అడ్డాగా చేసుకుని భారీ స్థాయిలో సారా తయారీ సాగుతున్నా పోలీసులు ఫారెస్టు వైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏళ్ల తరబడి గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ వ్యవహారమంతా పోలీసుల కనుసన్నల్లో జరుగుతుందని, మామూళ్లకు అలవాటుపడిన సారా బట్టీల నిర్వాహకులను ప్రోత్సహిస్తూ మత్తులో జోగుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



హైవేను ఆనుకుని 2 వేల ఎకరాలు

జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టు ఆహ్లాదకర వాతావరణం,పచ్చని ప్రకృతి సోయగాలతో వీక్షకులను మైమరపించేలా ఉంటుంది. దాదాపు 845 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన రిజర్వు ఫారెస్టును 16వ నెంబరు జాతీయ రహదారి రెండు భాగాలు విభజించింది. దీనిలో ఈస్ట్ ఫారెస్టు 311 హెక్టార్ల విస్తీర్ణం, వెస్ట్ ఫారెస్టు మరో 534 హెక్టార్లు విస్తీర్ణంలో విస్తరించి ఉన్నది. సుమారు 2112.5 ఎకరాలు ఉంటుంది. ఈ ఫారెస్టులో జం తువులు అరుదు.దీంతో కొంతమంది అక్రమార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మలుచుకుంటున్నారు.రాజమహేంద్రవరానికి చేరువలో హైవేను ఆనుకుని ఇరువైపులా రిజర్వు ఫారెస్టు విస్తరించి ఉండడంతో రిసార్టులు ఏర్పాటు చేస్తే టూరిస్టుల రాకతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని..పుష్కరాల నేపథ్యంలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ దృష్టి సారించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


ప్రమాదం జరిగిన రోజు అటవీ ప్రాంతం పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్ ఇతర అధికారులు (ఫైల్)

వ్యభిచార స్థావరాలు..

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టులో వ్యభిచార స్థావరాలు ఎక్కువగానే దర్శనమిస్తాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఇరువైపులా ఫారెస్టు, పండ్ల తోటల్లో ఇతర ప్రాంతాలకు చెందిన కొంత మంది వ్యభిచారాలు సాగిస్తున్నారు. జాతీయ రహదారిపై వెళుతుంటే నిత్యం పదుల సంఖ్యలో తారసపడతారు. రాజానగరం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్నా దీనికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు.వ్యభిచారుల వద్దకు వస్తున్న విటులను కొంతమంది అప్పుడప్పుడు పోలీసులకు పట్టిస్తుంటారు. వీరిని పోలీసులు భయభ్రాంతులకు గురిచేసి వీరి వద్ద ఉన్న నగదు,బంగారం దోచుకున్న సంఘటనలూ ఉన్నాయి.వ్యభిచార స్థావరాలు కొంత మంది పోలీసులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. అందుకే ఈ స్థావరాలపై పోలీసులు దాడి చేసిన సందర్భాల్లేవు. వ్యభిచారం కోసం వెళ్లిన వారు స్మోకింగ్ చేసి పారేసిన సిగరెట్ వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

ఆక్రమణల్లో రిజర్వు ఫారెస్టు..

దివాన్‌చెరువు రిజర్వు ఫారెస్టు చుట్టూ ఆక్రమణలే దర్శనమిస్తాయి. ఫారెస్టును ఆనుకుని పక్కా భవన నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. ఇటీవల ఆటోనగర్ సమీప ప్రాంతంలో అడవి లో చెట్లను నరికేస్తున్నా అడిగేవారే లేరు. నగరానికి సమీపాన ఉండడంతో చుట్టూ పండ్ల తోటలతో పాటుగా మరికొన్ని చోట్ల పక్కా భవనాలు, జోరుగా సారా బట్టీలు పుట్టుకొస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూడడంలేదు. దీంతో అడవి ఆక్రమణలకు గురవుతోంది.

అమ్మకాలు.. చిక్కెన్!



వెలవెలబోయిన చికెన్ దుకాణాలు

- కనిపించిన బర్డ్‌ఫ్లూ ప్రభావం
- భారీగా పడిపోయిన అమ్మకాలు
- చికెన్ కొనుగోళ్లు లేక నిరాశ
- మటన్, ఫిష్ వైపు చూపు
- ధరలు పెంచేసిన వ్యాపారులు

అనపర్తి/కొవ్వూరు/నల్లజర్ల,ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : బర్డ్ ఫ్లూ భయపెడుతోంది.. ఎంతలా అంటే.. నిన్నటి వరకూ ఆదివారం వచ్చిందంటే చికెన్ ముక్కలేనిదే ముద్ద దిగని పరిస్థితి.. అయితే బర్డ్‌ఫ్లూ ప్రభావంతో ఆదివారం చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి. ధరలు కాస్త తగ్గినప్పటికీ వినియోగదారులు లేకపోవడంతో దుకాణాలు ఖాళీగా దర్శనమిచ్చాయి.అనపర్తిలోని మార్కెట్లో మాత్రమే దుకాణాలు తెరుచుకున్నాయి.అయినప్పటికీ వినియోగదారులు అటువైపు చూడకపోవడంతో చికెన్ షాపుల యజమానులు వినియోగదారుల కోసం పడిగాపులు కాశారు. మరో వైపు ఫిష్, మటన్ అమ్మకాలు పెరగడంతో ఆయా దుకాణాల వద్ద రద్దీ కనిపించింది. మటన్ వినియోగదారులకు మాత్రం ధరల విషయంలో జేబులకు చిల్లులు పడ్డాయి. అనపర్తిలో ఆదివారం ఒక్క రోజునే సుమారు 1000 కోళ్ల అమ్మకాలు జరగాల్సి ఉండగా కనీసం 50 కోళ్లు కూడా విక్ర యించలేదని చికెన్ వ్యాపారులు వాపోతున్నారు. అమ్మకాలు నిలిచిపోవడంతో చికెన్ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. అన పర్తి పరిసరాల్లో బర్డ్ ఫ్లూ లేకపోయినా వినియోగదారులు మాత్రం చికెన్ తినేందుకు భయపడుతున్నారు. కొవ్వూరు పట్టణ, మండలంలోనూ చికెన్ షాపులు వెలవెలబోయాయి. కొవ్వూరు పట్టణంలో ఆదివారం ఒక్కరోజే 3 వేలకు పైగా కోళ్ల అమ్మకాలు సాగేవి.. ఆదివారం వ్యాపారం ఉంటుందని ఆశతో దుకాణాలు తెరచినప్పటికీ చికెన్ కొనుగోలుకు ప్రజలు ముందుకు రాకపోవడంతో వ్యాపారులు నిరాశ చెందారు.గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయల వ్యాపారం నష్టపోయామని వ్యాపారులు వాపోతున్నారు.


కొవ్వూరులో ఖాళీగా ఉన్న చికెన్ షాపు

మటన్‌పైనే మక్కువ..

చికెన్ షాపులు వెలవెలబోయాయి.ఇదిలా ఉండగా మాంసాహార ప్రియులు మటన్‌పై మక్కువ చూపిస్తున్నారు.ఇదే అదనుగా మటన్, చేపల వ్యాపారులు ఇష్టానుసారం ధరలు పెంచేశారు. ఆదివారం మార్కెట్‌లో ఎక్కువగా మటన్ అమ్ముడుపోయింది.దీంతో నిన్నటి వరకురూ.800 పలికిన మటన్ ధర రూ.1000కి చేరుకోగా రూ.1000లు ఉన్న బోన్‌లెస్ మటన్ ధర రూ.1200కు చేరుకుంది.మరో వైపు చేపల వ్యాపారులు ధరలు పెంచేశారు.కిలో రూ.170లకు లభించాల్సిన చేప నేడు రూ.200కు చేరింది.అమాంతం ధరలు పెంచేసినా ధరల నియంత్రణపై అధికారులు చర్యలు తీసుకోవడంలేదని వినియోగదారులు వాపోతున్నారు.


అనపర్తిలో చేపల దుకాణం వద్ద అమ్మకాలు

దగ్గరుండి భూసర్వే చేయించుకోండి

రీసర్వేపై అవగాహన ర్యాలీలో జేసీ చిన్నరాముడు

రాజానగరం/రంగంపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వే చేసే సమయంలో సంబంధిత భూయజమానులు అందుబాటులో ఉండాలని జేసీ చిన్నరాముడు పిలుపునిచ్చారు.రాజానగరం మండలం తోకాడ, రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామంలో ఆదివారం భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ మన భూమి.. మన భవిష్యత్ అన్నారు. దీనిలో భాగంగా క్షేత్ర స్థాయిలో భూములు రీసర్వే చేపట్టడం జరుగుతుందన్నారు.రెవెన్యూ సిబ్బంది రీసర్వే చేసే సమయంలో భూ యజమానులు అందుబాటులో ఉంటూ సరిహద్దుల నిర్ణయించే ప్రక్రియలో సర్వే సిబ్బందికి సహకరిస్తే వివాదాలకు ఆస్కారం లేకుండా పరిష్కారం లభిస్తుందన్నారు. రీ సర్వే అనేది మన భూహక్కు పత్రాలకు బలమైన పునాది అనే విషయాన్ని మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి,ఎంపీడీవో జేఏ ఝాన్సీ, కూటమి నాయకులు ఎలుగుబంటి సత్తిబాబు, జటప్రోలు వెంకటేశ్వరరావు, తహశీల్దార్ కోసు అనసూయ, ఎంపీడీవో సాయిబాబు, డీటీ ఉండవిల్లి రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.



దొంతమూరు అవగాహన ర్యాలీలో జేసీ చిన్నరాముడు తదితరులు

28 రోజుల్లో పది పరీక్షలు : డీఈవో

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):పదో తరగతి పరీక్షలు 28 రోజుల్లో మాత్రమే ఉన్నాయని..సమయాన్ని సద్వినియోగం చేసుకుంటేనే విజేత అవుతారని డీఈవో వాసుదేవరావు అన్నారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పది విద్యార్థుల ప్రత్యేక తరగతులను ఆదివారం ఆయన పరిశీలించి మా ట్లాడారు. ఈ 28రోజులు చదివేది అత్యంత కీలకమన్నారు. ఇప్పటి వరకూ జరిగిన అన్ని పోటీ పరీక్షల్లో ఏయే అంశాల్లో మార్కులు తగ్గుతున్నాయో చూసుకుని ఉపాధ్యాయులతో సందేహాలను నివృత్తి చేసుకుని నూరుశాతం మార్కులు సాధించేలా కృషి చేయాలన్నారు.ఆరోగ్యం పట్ల కూడా అత్యంత శ్రద్ధ వహించాలన్నారు. త్వరగా నిద్రపోవడం, తెల్లవారుజామున లేచి సాధన చేయాలన్నారు.కార్యక్రమంలో హెచ్ఎం ఎంవీఎం. సుబ్రహ్మణ్యం,ఉపాధ్యాయులు జి.అప్పా రావు, కన్నమదొర, విద్యార్థులు పాల్గొన్నారు.

నష్టాలు.. ఫుల్!



మద్యం ఫుల్.. అమ్మకాలు డీలా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)
జిల్లాలో మద్యం అమ్మకాలు మగతగా సాగుతున్నాయి. అటు మద్యపాన ప్రియుల సంఖ్య తగ్గలేదు. ఇటు మద్యం డిపోలో నాణ్యమైన సరుకు ఫుల్‌గా ఉంది.అయినా ప్రభుత్వ ఖజానాకు రాబడిలో మాత్రం గండి పడుతోంది. అమ్మకాల్లో పెద్దగా పెరుగుదల కనిపించడం లేదు. కూటమిప్రభుత్వంలో నాణ్యమైన మద్యం అందుబాటులోకి వచ్చింది.పైగా అధిక ధరలకూ కళ్లెం పడింది. అయితే ఇప్పుడు మద్యం అమ్మకాల్లో చిత్రమైన పరిస్థితి కానవస్తోంది. నాణ్యమైన సరుకు ఫుల్లుగా అందుబాటులో ఉన్నా అమ్మకాలు నీరసంగా జరుగుతున్నాయి.లాభాలు అటుంచితే నష్టాలను మూటగట్టుకుంటున్నామంటూ మద్యం వ్యాపారులు వాపోతున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కమీ షన్‌ని 14 శాతానికి పెంచడానికి ఆంగీకరించినా మద్యం అమ్మకాలు ఇలాగే నీరసంగా ఉంటే ఫలితం ఉండకపోవచ్చనే వాదన వినవస్తోంది.జిల్లాలో స్థిమితం లేని మద్యం అమ్మకాలపై ప్రత్యేక కథనం.

- దుకాణాల్లో 200 రకాల బ్రాండ్లు
- డిపోలో లక్ష కేసులు నిల్వ
- అమ్మకాల్లో మాత్రం నీరసం
- ప్రభుత్వ ఖజానాకు గండి
- పెరిగిన సారా తయారీ
- పట్టించుకోని ఎక్సయిజ్ శాఖ
- కమీషన్ పెంపుతో కాస్త ఊరట

సరుకు ఫుల్..అమ్మకాలు నిల్

వైసీపీ హయాంలో జగన్ పిచ్చి మందు అందుబాటులో ఉండేది. కూటమి ప్రభుత్వంలో టిన్ బీర్లతో సహా దాదాపు 200 రకాల బ్రాండ్ల సరుకు వస్తోంది.ఏపీఎస్‌బీసీఎల్ డిపోల నిండా మద్యం ఉంది. కానీ అమ్మకాలు మాత్రం పడిపోయాయి. వైసీపీ ప్రభుత్వంలో నాసిరకం మద్యం రోజుకు రూ.2 కోట్ల మేర అమ్మకాలు ఉంటే..ఇప్పుడు 200 రకాల బ్రాండ్లు అందుబాటులో ఉన్నా అంతే విక్ర యాలు ఉండడం గమనార్హం.రాజమహేంద్రవరం డిపోలో సుమారు లక్ష కేసుల వరకూ నిల్వ ఉండగా.. రోజుకు సరాసరిన 5 వేల కేసులు మాత్రమే వెళుతోంది. సరిగా అమ్మకాలు లేక దుకాణదారులు ఆచితూచి ఇండెంట్ పెడుతున్నారు.కూటమి ప్రభుత్వం చీఫ్ లిక్కర్ రూ.99 చేయగా.. ఎక్కువగా అమ్ముడయ్యే బ్రాండ్ల ధరలు నేలకు దించింది.

పూటుగా సారా!

ప్రైవేటు బాంద్రీ షాపుల కేటాయింపులో మండల కేంద్రాలను మాత్రమే యూనిట్‌గా తీసుకున్నారు. దీంతో గ్రామాల్లో మద్యం దుకాణాలు లేకుండా పోయాయి. ఇదిలా ఉండగా నగరాలు, గ్రామాలు తేడా లేకుండా సారా పూటుగా దొరుకుతోంది. దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టు,గోదావరి లంకల్లో సారా తయారీ కుటీర పరిశ్రమగా మారింది. సారాను గుట్టు చప్పుడు కాకుండా తయారుచేసి పట్టణాలు, పల్లెలకు తరలిస్తున్నారు. ఉదాహరణకు జిల్లా కేంద్రం రాజమహేంద్రవరం నగరంలో సీటీఆర్ఐ పనస చెట్టు సెంటర్, క్వారీ మార్కెట్ అన్న క్యాంటీన్ సమీపంలో పగలూ రాత్రీ తేడా లేకుండా సారా అమ్ముతున్నా ఎక్సయిజ్ అధికారులకు మాత్రం 'ఎందుకనో' వాసన రావడం లేదు. దీంతో ప్రభుత్వం రూ.99కే నాణ్యమైనా చీఫ్ లిక్కర్ ఇస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ఏదేమైనా అటు జనాల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు సారా వల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ శాఖ వల్లే సర్కారు ఆదాయానికి చిల్లు పడుతోందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

బార్లలోనూ ఎంఆర్‌పీ!

బార్ల అమ్మకాల పరిస్థితి కూడా అధ్వానంగా తయారైంది. ఒకప్పుడు రోజుకు రూ.2లక్షల విక్రయాలు జరిగే బార్‌లో ఇప్పుడు రూ.50వేలు దాటడం కష్టమవుతోంది. బార్‌ల యజమానులు ఈ ఏడాది సెప్టెంబరు వరకూ ప్రభుత్వానికి (గత ప్రభుత్వం) లైసెన్సు ఫీజును కట్టేశారు. దీంతో అప్పటి వరకూ పర్మిట్ రూమ్‌లు ఇవ్వకూడదని బార్‌ల యజమానులు ఎక్సైజ్ శాఖను కోరారు. కొత్త మద్యం పాలసీలో భాగ ంగా ఆ అంశంపై ఎక్సైజ్ శాఖ సానుకూలంగా స్పందించింది. తీరా ప్రైవేటు మద్యం షాపులు వచ్చాక తీరు మారిపోయింది. ముఖ్యంగా మద్యం షాపులకు పర్మిట్ రూమ్‌లు లేకపో యినా అనధికారికంగా అమలు చేస్తున్నారు. మద్యం షాపుల వద్దే బహిరంగంగా మద్యం సేవిస్తున్నా ఎక్సైజ్ అధికారులకు కానరావడం లేదు.దీంతో బార్లలో సేల్స్ పడిపోయింది. రోజూ నష్టాలు చూసే బదులు బార్‌లకు తాళాలు వేసి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కి ఇచ్చేద్దామనే ఆలోచన చేసిన బార్‌ల యజమానులు.. ప్రభుత్వం కమిషన్‌ని సవరించడంతో తాము కూడా ఎంఆర్‌పీ ధరలకు అమ్మడానికి సిద్ధపడుతున్నారు.

కొవ్వూరు
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

కిటకిటలాడిన కోట సత్తెమ్మ ఆలయం

● అమ్మవారికి విశేష పూజలు

నిడదవోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ ఆలయం ఆదివారం కిటకిటలాడింది. పలు జిల్లాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి విశేషపూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు గావించారు. అనంతరం క్షీర, మహానివేదన చేశారు. తర్వాత ప్రత్యేక పూలతో అలంకరించారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 31,440, అన్నదాన విరాళాల ద్వారా రూ.8,256, ప్రసాద విక్రయాల ద్వారా రూ.31,050, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా రూ.51,456/, మొత్తం రూ.1,22,202 ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వీ.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బాధితుడికి ఆర్థిక సాయం అందజేత


సాయం అందిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం గ్రామానికి చెందిన దారం యేసు వెన్నెముక సమస్యతో బాధపడుతు న్నాడు. ఈ విషయం తెలుసుకున్న మానవతా సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ రూ. ఆరు వేలు, జిల్లా రక్తదాన డైరెక్టర్ జోడాల వెంకటేశ్వరరావు తన మిత్ర బృదంతో కలిసి మరో రూ. 3500 అందించారు. ఈ సందర్భంగా జోడాల మాట్లాడుతూ వెన్నెముక ఆపరేషన్‌కు సుమారు రూ. నాలుగు లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఎవరైనా దాతలు ఉంటే ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మానవతా సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సుందరేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన

కొవ్వూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పదక్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన నిర్వహించారు. ఆదివారం పూజా కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి గణపతిపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకాలు, రుద్రహోమం, పంచామత అభిషేకాలు, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, స్వామి వారికి లక్షబిళ్వార్చన గావించారు. అనంతరం ఆలయ అర్చకుడు మానేపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సుందర గణేష్ దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. అనంతరం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కలిగొట్ల కృష్ణారావు, కొవ్వూరు పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న పండితులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పాలంగి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా సోమవారం పాలంగి, కె. సావరం, చివటం గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎన్‌ఎన్ అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పచ్చని చెట్లపై... గొడ్డలి వేటు

● పోలవరం కుడి కాల్వ గట్లపై చెట్లు నరికివేత
● పట్టించుకోని అటవీ, ఇరిగేషన్ అధికారులు


చెట్టును నరికివేయగా మిగిలిన మొదలు

నల్లజర్ల, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): పచ్చని చెట్లు .. ప్రగతికి మెట్లు అంటారు. అలాంటి చెట్లు గొడ్డలి వేటుకు గురువుతున్నాయి. వివరాల్లోకి వెళితే... పోలవరం కుడి కాల్వ గట్లపై మట్టితోపాటు చెట్లు సైతం రాత్రికి రాత్రే మాయమవుతున్నాయి. మొన్నటి వరకు మట్టి మాఫియా చెలరేగగా, ప్రస్తుతం కలప మాఫియా అలజడి సృష్టిస్తోంది. ఈ కాల్వపై తుమ్మ, వేపచెట్లు ఏపుగా పెరిగి పచ్చగా కనిపించేవి. ప్రస్తుతం అవన్నీ నరికేయడంతో ఆ ప్రాంతం ఎడారిగా మారింది. దేవరపల్లి మండలం నల్లజర్ల, ఉంగుటూరు మండలం వరకు కలప మాఫియా చెట్లను కొల్లగొడుతోంది. వీటిని పరిరక్షించాల్సిన అటవీ, ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. పోలవరం ఇరిగేషన్ డీఈను వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.


పడి ఉన్న చెట్టు కొమ్మలు


ఎయిర్‌పోర్టు ఆవరణలో మంత్రి నాదెండ్లతో సుబ్బరాయచౌదరి

మంత్రి మనోహర్‌ను కలిసిన జొన్నలగడ్డ

కొవ్వూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన హైదరాబాద్ నుంచి వచ్చారు. ఈ సందర్భంగా కొద్దిసేపు నియోజకవర్గంలోని పలు విషయాలు, కూటమి ప్రభుత్వ పాలనపై చర్చించారు.

పొగాకు రైతుల్లో ఆందోళన


గోపాలపురంలోని పొగాకు తోటలో ఆకులకు పట్టిన చీడ

గోపాలపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా పొగాకు రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఏడాది వరుస తుఫాన్లతో నాట్లు కాస్త ఆలస్యం కావడంతో మొక్క ఏపుగా పెంచటానికి నానాతంటాలు పడ్డారు. ముఖ్యంగా మొక్క రేల్పుదశలో చీడపీడలు ఆశించటంతో ఆకులను మొత్తం పురుగు తినేస్తుంది. దీంతో ఆకు మొత్తం రంధ్రాలు పడి జల్లెడ మాదిరిగా తయారవుతోంది. దీన్నిఎలా నియంత్రించాలో తెలీక తలలు పట్టుకుంటున్నారు. ఒకవేళ నివారించకపోతే దిగుబడి పూర్తిగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

● పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పిలుపు

కొవ్వూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పిలుపునిచ్చారు. కొవ్వూరులోని పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సలాది సందీప్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం పట్టణ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఇందులో జనరల్ సెక్రటరీగా టీ.విజయభాస్కర్, ఉపాధ్యక్షులుగా చెరుకూరి సాయిరాజు, పసలపూడి అరుణ, పలాల సత్తిబాబు, సెక్రటరీలుగా బాలదారి చక్రపాణి, గోవిదం రాణాప్రతాప్, జె. రాజ్‌కమల్, ఆర్. వెంకటలక్ష్మి, పీ.అంజలి, ఎస్సీ మోర్చ ప్రెసిడెంట్‌గా మల్లవరపు కృష్ణ, యువ మోర్చ అధ్య క్షుడిగా అడ్డూరి సత్యనారాయణను ఎన్నుకున్నారు. అనంతరం 9వ వార్డులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పరిమి రాధాకృష్ణ, నీరుకొండ సూర్యనారాయణ, మాట్ల ఆంజనేయులు, బీవీ ముత్యాలరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ , తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరు పట్టణ బీజేపీ నూతన కార్యవర్గం

ఉండ్రాజవరం / పెరవలి: బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కోరారు. తీపర్రులో ఆదివారం పెరవలి మండల బీజేపీ కార్యవర్గ సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడిగా బల్ల లీలాకృష్ణ, ఉపాధ్యక్షులుగా కరుటూరి సుబ్బారావు, ఓలేటి ఉదయలక్ష్మి, శివకోటి కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా కలిదిండి శివప్రసాదరాజు, కర్రి సత్యనారాయణ, కిసాన్‌మోర్చ అధ్యక్షుడిగా బోగవల్లి సత్యనారాయణ, ఎబీసీ మోర్చా అధ్యక్షుడిగా వాటాల వెంకటేశ్వరరావు, యువమోర్చ అధ్యక్షు డిగా కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సింహాద్రి వీర వెంకట సత్యనారాయణ, అసెంబ్లీ కన్వీనర్ బండి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రంగినీడి గంగాధర రావు, తదితరులు పాల్గొన్నారు.

'అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలి'

కొవ్వూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజీనామా చేయాలని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. కోట్లాది మంది భక్తులు కుంభమేళాకు వెళ్తున్నారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయకపోవడం బాధాకరమన్నారు. ఒక ట్రైన్‌కు సుమారు 1500 టిక్కెట్లు అమ్మడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయడానికి కాకుండా ఆదాయం కోసమే రైల్వేశాఖ పనిచేస్తోందని ఆరోపించారు. సామాన్య ప్రయాణికులకు రక్షణ కల్పించడంలో కేంద్రం వైఫల్యం చెందిందన్నారు.

షిర్డీసాయి బాబా ఆలయ వార్షికోత్సవం


సుదర్శన హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

చాగల్లు, ఫిబ్రవరి 16, (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయం పక్కన గల షిర్డీసాయి బాబా ఆలయంలో వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేతా సురేష్ దంపతులు సుదర్శన హోమాన్ని నిర్వహించారు. సాయంత్రం కేశరి బాలమిత్ర మండలి వారిచే భజన కాలక్షేపం చేశారు. భక్తులు విశేషంగా విచ్చేసి స్వామి వారి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీజేపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు వీరే..

చాగల్లు, ఫిబ్రవరి 16, (ఆంధ్రజ్యోతి): బీజేపీ అనుబంధ సంఘాల అధ్యక్షులను ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వరప్రసాద్ ప్రకటించారు. మండల యువ మోర్చ అధ్యక్షుడిగా తాళ్లూరి రమేష్, మహిళ మోర్చ అధ్యక్షురాలిగా తమ్మిశెట్టి రమాదేవి, ఓబీసీ మోర్చ అధ్యక్షుడిగా దొంగ లక్ష్మీనారాయణ, కిసాన్ మోర్చ అధ్యక్షుడిగా కుడప నాగరాజు, దళిత మోర్చ అధ్యక్షురాలిగా ఆకుల సుజాతను ఎన్నుకున్నట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారిని పార్టీ నాయకులు అభినందించారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

నిడదవోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శెట్టిపేట పవర్ ప్లాంట్ సమీపంలోని కాలువ వద్ద ఆదివారం ఒక వృద్ధుడు అనుమానాస్పదంగా మృతిచెంది కనిపించాడు. మృతుడు నల్లజర్ల మండలం పోతవరం గ్రామానికి చెందిన గాడి వెంకటేశ్వరరావు (77)గా గుర్తించారు. దీనిపై పట్టణ ఎస్ఐ పరమహంస కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి : ఎమ్మెల్యే


క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్ర జ్యోతి) : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపర్చిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. ఎన్నికల ప్రచా రంలో భాగంగా ఆదివారం కొవ్వూ రు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో టీడీపీ క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యత ఓటు రాజశేఖర్‌కు వేసి గెలిపించాలని అభ్యర్థించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, సూరపనేని చిన్ని, టీడీపీ మండల అధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పెనుమాక జయరాజు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగ ... యమపాశమై

● యువ రైతు కూలి మృతి ● పురుషోత్తపల్లిలో విషాదం

నిడదవోలు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కరెంట్ తీగ ఆయన పాలిట యమపాశమైంది. అరటి తోటకు ఎరువు కొడుతుండగా ... ఊహించని రీతిలో మృత్యువు కాటేసింది. ఒక్కసారిగా వైరు తెగిపడడంతో యువ రైతు కూలి మృతిచెందాడు. ఈ హృదయ విదారకర ఘటన పురుషోత్తపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. వివరాలివి.. దేశా బత్తుల నరేష్ (35) పందలపర్రులోని అరటి తోటకు వెళ్లి మందును స్ప్రే చేస్తుండగా వైరు తెగిపడింది. దీంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.విషయం తెలుసుకున్న బంధువులు వెళ్లి బోరున విలపించారు. తండ్రిని విగతజీవిగా పడి ఉండటాన్ని చూసిన పిల్లల్ని ఆపడం ఎవరితరమూ కాలేదు. ఈయనకు భార్య మౌనిక, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమిశ్రగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు.


విద్యుత్ తీగ పడడంతో మృతి చెందిన రైతు కూలి నరేష్


ఊటను ధ్వంసం చేస్తున్న ఎస్ఐ సతీష్

బెల్లం ఊట ధ్వంసం

తాళ్లపూడి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చింతపూడి లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ సమీపంలోని పొదల్లో సారా కాయడానికి ఉంచిన బెల్లపు ఊట డ్రమ్ములను ఆదివారం ధ్వంసం చేశారు. ఈ మేరకు ఎస్ఐ సతీష్‌కు సమాచారం అందడంతో తన సిబ్బందితో వెళ్లారు.

తక్కువ ధరలకు అమ్మి మోసపోవద్దు

● రైతు బజార్లలో పంటలను విక్రయించుకోవాలి : జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంటలు పండించే రైతులు దళారులకు తక్కువ ధరలకు అమ్మి మోసపోవద్దని, పంటలను రైతు బజార్లలో విక్రయించుకుని గిట్టుబాటు ధరలను పొందాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లాలో కూరగాయలను సాగు చేస్తున్న రైతులంతా తమ పంటలను రైతు బజార్లకు తీసుకురావడం ద్వారా మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. మరింత సమాచారం కోసం మార్కెటింగ్ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం జిల్లాలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున కూరగాయల పంటలు అంచనాలకు మించి దిగుబడి వస్తున్నాయని తెలిపారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర రాకపోవడంతో బయట పారవేస్తున్న సంఘటనలు జరుగుతున్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులు రైతు బజార్ల ద్వారా తమ పంటలను విక్రయించుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం రైతులు ఎస్టేట్ అధికారులు 99491 31315 (శ్రీనివాస్), 98493 33136 (వెంకటేశ్వరరావు, 90592 71999 (తేజ)లను సంప్రదించాలని జిల్లా మార్కెటింగ్ అధికారి సునీల్ వినయ్ పేర్కొన్నారు.

రాజశేఖర్ విజయానికి కృషిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల, చిత్రంలో మంత్రి దుర్గేష్, అభ్యర్థి పేరాబత్తుల

▸ మొదటి ప్రాధాన్యత ఓటుతో పేరాబత్తులను గెలిపించుకోవాలి
▸ రాష్ట్ర మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్
▸ జనసేన గోదావరి జిల్లాల ప్రతినిధుల ఆత్మీయ సమావేశం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. జనసేన గోదావరి జిల్లాల ప్రతినిధులతో స్థానిక చెరుకూరి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి వారిద్దరూ విచ్చేసి మాట్లాడారు. సమన్వయంతో ముందుకు వెళ్లాలని, మొదటి ప్రాధాన్య ఓటుతో పేరాబత్తులను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా రాజశేఖరంను మరోసారి అందరికీ పరిచయం చేశారు. సమావేశంలో జనసేన ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, పంతం నానాజీ, పార్టీ సీనియర్ నాయకులు, ముఖ్యులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీస్ రెగ్యులరైజేషన్‌ను పునఃప్రారంభించండి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీస్ రెగ్యులరైజేషన్ ప్రక్రియ పునఃప్రారంభించాలని కాంట్రాక్టు లెక్చరర్స్ 475 అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల మాణిక్యం కోరారు. స్థానిక చెరుకూరి కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పిఠాపురం జనసేన నాయకులు జోగా వీరవెంకటరమణ, సూరంపూడి సురేష్, మార్నీడి రంగబాబు, వనం వీరబాబులతో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. మంత్రి మాట్లాడుతూ ఈ విషయాన్ని సంబంధిత శాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. నేతల శ్యామ్‌కిరణ్, మూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

సినీ నిర్మాత కృష్ణవేణి అస్తమయం

● పంగిడిగూడెం నుంచి సినీ రంగానికి
● గోదావరి జిల్లాల్లో విషాదఛాయలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆడవాళ్లు బయటకు రావాలంటేనే భయపడే రోజులవి.. అయినా ఆమె వచ్చారు.. నిర్మాతగా మారి ఎన్నో సినిమాలు నిర్మించారు.. ఎన్‌టీఆర్.. ఘంటసాలను సినిమా రంగానికి పరిచయం చేసింది కూడా ఆవిడే.. ఆమె గోదావరి జిల్లాల్లోని పంగిడిగూడెం గ్రామానికి చెందిన కృష్ణవేణి (102). ఆమె ఆదివారం హైదరాబాద్‌లోని స్వగృహంలో మృతి చెందడంతో ఉభయగోదావరి జిల్లాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమె 1924లో జన్మించారు. స్వగ్రామం నుంచి కళాకారిణిగా అంచలంచెలుగా ఎదిగారు. అనేక నాటక సమాజాల్లో వేషాలు వేసి సినిమా రంగంలో ప్రవేశించారు. మీర్జాపూర్ రాజాను వివాహం చేసుకున్నారు. 1936లో భర్తతో కలిసి శోభనాచలం స్టూడియోను నిర్మించి తొలిగా "సతీ అనసూయ" చిత్రాన్ని నిర్మించారు. ఆమె సొంతంగా 1948లో మన దేశం సినిమా నిర్మాతగా మారి టీడీపీ వ్యవస్థాపకులు ఎన్‌టీ.రామారావును మొట్టమొదటిసారిగా వెండి తెరకు పరిచయం చేయడంతో పాటు, మొదటి సారిగా ప్రముఖ గాయకుడు ఘంటసాలను సంగీత దర్శకుడిగా పరిచయం చేశారు. అటు తర్వాత దాంపత్యం,భక్తప్రహ్లాద, కీలుగుర్రం, బాలమిత్రుల కథ వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. ఆమె తరువాత ఆమె కుమార్తె అనూరాధ కూడా అనేక హిట్ చిత్రాలను నిర్మించారు. వారికి రఘుపతి వెంకయ్య నాయుడు అవార్డును ప్రభుత్వం ఇటీవల అందించడం గర్వించదగ్గ విషయం. ఇటీవల విజయవాడలో ఆమె ఎన్‌టీఆర్ స్మారక అవార్డును అందుకున్నారు. దీంతో సినిమా రంగంలో విషాదం చోటుచేసుకుంది.


కృష్ణవేణితో రాకా కార్యదర్శి రమణ

కృష్ణవేణి మృతి బాధాకరం

శత వసంతాలు నిండిన కృష్ణవేణి మృతి బాధాకరం. హైదరాబాదు వెళ్లినప్పుడల్లా ఆమెను కలుసుకుంటూ ఉండేవాడిని.. ఆమె ఆరోగ్యం కుదుట పడిన తరువాత రాజమహేంద్రవరంలో సత్కరించాలని భావించా. అయితే అది కోరికగానే మిగిలిపోయింది. తెలుగు జాతి మనది నిండుగ వెలుగు జాతి మనది అని తెలుగు జాతి విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన ఎన్‌టీఆర్‌ను సినీ ప్రపంచానికి పరిచయం చేసిన కృష్ణవేణి జీవితం ధన్యం.

జీవీరమణ, రాకా సంస్థ సెక్రటరీ, రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరంలో ఫస్ట్ ఆల్ బ్రీడ్ ఓపెన్ డాగ్‌షో

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంలోని మన్యం గార్డెన్స్‌లో గోదావరి కెన్నెల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చిన ఫస్ట్ ఆల్ బ్రీడ్ ఓపెన్ డాగ్‌షో నిర్వహించారు. సుమారు 200 పైబడి పెంపుడు శునకాలతో వాటి యజమానులు ఈ షోకు హాజరయ్యారు. వారి వివిధ రకాల ఇండియన్ బ్రీడ్‌ల పెంపుడు శునకాలను ప్రదర్శించారు. ప్రదర్శన ముగింపులో ఉత్తమంగా ఉన్న శునకాలను గుర్తించి నిర్వాహకులు బహుమతులను అందించారు.


ప్రదర్శనకు వచ్చిన శునకాలతో వాటి యజమానులు